
ఒంగోలు టీడీపీ ఆఫీసులో భోగి సంబరాల్లో మహిళలు
భోగిళ్లమ్మ భోగిళ్లు..




పామూరులోని వాసవి దేవస్థానం వద్ద భోగి మంట చుట్టూ చేరి వేడుక చేసుకుంటున్న గ్రామస్థులు

చిన్నారుల కేరింత

ఊరూవాడా పండుగే

- జిల్లా అంతటా సంక్రాంతి శోభ.. వీధివీధినా భోగి మంటలు
- పల్లెల్లో సందడి... పట్టణాల్లో ఉత్సాహంగా ఆటల పోటీలు
- నోరూరించే పిండి వంటలు, ముగ్గులతో మహిళలు బిజీబిజీ

ఒంగోలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేళ ఊరూవాడా సందడి నెలకొంది. మూడు రోజుల పాటు సాగే సంక్రాంతి పర్వదిన వేడుకలలో తొలి రోజైన భోగి పండుగ సోమవారం ఉత్సాహంగా సాగింది. పల్లె, పట్టణం తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ ఇంటింటా భోగి మంటలు వేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ఇళ్లు, కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు పట్టణాల్లో భోగి మంటలు కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించాయి. పట్టణాలతో పోల్చితే పల్లెల్లో సంక్రాంతి మరింత సందడిగా ఉంది. సంక్రాంతికి ఇతర ప్రాంతాల నుంచి జనం స్వగ్రామాలకు భారీగానే తరలివచ్చారు. పండుగకు ముందు రెండు రోజులు సెలవు దినాలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వేలాదిగా కుటుంబాలతో ముందే

మిగతా 8లో...


ఒంగోలులోని కమ్మపాలెంలో ముగ్గుల పోటీల్లో మహిళలు


యువతుల ఆనంద హేల


బసవన్నలు భళా


హరిదాసుడి కీర్తనలు

అద్దంకి నియోజకవర్గంలోని రెండు సొసైటీల్లో నాయకుల మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. మంత్రి రవికుమార్ జోక్యం చేసుకోక తప్పలేదు. బల్లికురవ, వెల్లలచెరువు పీఏసీఎస్‌ల పరిధిలో నాయకుల మధ్య ఏకాభిప్రాయం ఏర్పడలేదు. మంత్రి రవికుమార్ రెండు రోజుల్లో తానే తుది నిర్ణయం తీసుకుంటానని చెప్పినట్లు తెలిసింది.

ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలోని చీమకుర్తి సింగిల్ విండోకు కూనాటి వెంకటరావు పేరు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఖరారు చేయగా మరో సీనియర్ నాయకుడు హనుమంతరావు తనకే అవకాశం ఇవ్వాలని గట్టిగా పట్టుపడుతున్నారు.

కొండపి నియోజకవర్గంలో చిరికూరపాడు సొసైటీకి ముగ్గురు నాయకులు పోటీపడటం నేతలకు తలనొప్పిగా మారింది. ఆశావహులంతా మంత్రి స్వామి, సత్యల వద్ద తేల్చుకుంటామని వారిని కలిసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

సహకారంపై కుస్తీ!

- సింగిల్ విండోలపై నేతల ముమ్మర కసరత్తు
- కొన్నిచోట్ల అశావహుల మధ్య గట్టిపోటీ
- కాదంటే అలకలు, అసంతృప్తులు
- నాలుగు రోజుల్లో జాబితాలు ఇవ్వాలని టీడీపీ అధిష్ఠానం ఆదేశాలు
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల తర్జనభర్జనలు



సొసైటీల పదవులపై అధికారపార్టీలో ముమ్మర కసరత్తు సాగుతోంది. గ్రామాల్లో ఒకపక్క సంక్రాంతి పండుగ హడావుడి నడుస్తుండగా సొసైటీల వారీ టీడీపీ ముఖ్య నేతలంతా ఈ అంశంపైనే దృష్టిపెట్టారు. కీలకమైన వాటిలో పోటీ పెరగటంతో ఆయా నియోజకవర్గాలోని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఏకాభిప్రాయం కోసం కుస్తీ పడుతున్నారు. జాబితా తయారు చేస్తున్నప్పటికీ పలు సొసైటీల విషయంలో కిందిస్థాయి నాయకుల మధ్య తీవ్రపోటీ నెలకొంది. ఇది ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకు తలనొప్పిగా మారింది. అలకలు, అసంతృప్తులు కూడా ఆరంభమయ్యాయి. దీంతో సొసైటీల త్రీమెన్ కమిటీల ఎంపికపై తర్జనభర్జనలు సాగుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)
సహకార వ్యవసాయ పరపతి సంఘాల (సొసైటీల)కు త్రీమెన్ కమిటీలను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఒక్కొక్క సొసైటీకి ఒక పర్సన్ ఇన్‌చార్జిగా ఒకరి పేరు, కమిటీ సభ్యులుగా ఇద్దరి పేర్లను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ బాధ్యతను టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులకు అప్పగిస్తూ అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. 16 లేక 17 తేదీల కల్లా జాబితాలు పంపాలని ఆదేశించింది. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు కిందిస్థాయి నాయకులకు సమాచారం ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 174 సింగిల్ విండోలు ఉండగా వాటన్నింటికీ త్రీమెన్ కమిటీలు నియమించాల్సి ఉంది. జిల్లాలో పర్చూరు, అద్దంకి, ఎస్ఎన్‌పాడు, కొండపి, కందుకూరు, దర్శి నియోజకవర్గాల్లో ఎక్కువగా సింగిల్ విండోలు ఉన్నాయి. ఆ తర్వాత కనిగిరి, మార్కాపురం, వైపాలెం గిద్దలూరుల్లో కనీసంగా నాలుగు నుంచి ఎనిమిది వరకు సొసైటీలు ఉన్నాయి. అతి తక్కువగా ఒంగోలు నియోజకవర్గంలో మూడు మాత్రమే ఉన్నాయి. ఈ సొసైటీలకు త్రీమెన్ కమిటీలు నియమించిన తర్వాత జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ)కి కూడా పాలకమండలిని నియమించే అవకాశం ఉంది.



కీలక సొసైటీల్లో పోటీ

అన్ని నియోజకవర్గాల్లో కీలక సొసైటీల పరిధిలో టీడీపీ నాయకులు పర్సన్ ఇన్‌చార్జి పదవి కోసం పోటీపడుతున్నారు. అలాంటి చోట ఎవరిని ఎంపిక చేయాలనే విషయంలో ఎమ్మెల్యేలు కూడా ఇబ్బందిపడుతున్నారు. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కొందరు కిందిస్థాయి నాయకులకు, తమ వ్యక్తిగత సిబ్బందికి సొసైటీల వారీ నాయకులతో మాట్లాడే బాధ్యత అప్పగించారు. అయితే వారి మాట కూడా వినని పరిస్థితి ఉంది. దీంతో తీవ్ర పోటీ నెలకొన్న సొసైటీల విషయంలో ప్రత్యక్షంగా ఎమ్మెల్యేలే జోక్యం చేసుకోక తప్పటం లేదు. అద్దంకి నియోజకవర్గంలోని వెల్లలచెరువులో దేవాలయాల నిర్మాణానికి ఎవరు ఎక్కువ

మిగతా 8లో...

మిగిలిన నియోజకవర్గాల్లో ఇలా..

- దర్శి నియోజకవర్గంలో 14 సొసైటీలుండగా ఏకాభిప్రాయంతో ఎంపికలు పూర్తిచేసేందుకు ఇన్‌చార్జి లక్ష్మి, ఆ పార్టీ నాయకులు లలిత్‌సాగర్ చర్చలు జరుపుతున్నారు. ఆరు సొసైటీల్లో నాయకులు మధ్య పోటీ నెలకొనగా నాలుగు సొసైటీల్లో నాయకులు రాజీకి ససేమిరా అనటంతో ప్రతిష్ఠాత్మకంగా మారింది.
- కనిగిరిలో ఎనిమిది సొసైటీల్లో ఒక్కటి మినహా మిగిలిన చోట్ల ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఇష్టప్రకారం నడుచుకుంటామని తేల్చిచెప్పారు.
- గిద్దలూరు నియోజకవర్గంలో తొమ్మిది సొసైటీల్లో మూడుచోట్ల నాయకుల మధ్య పోటీపెరగటంతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చర్చలు ప్రారంభించారు.
- మార్కాపురం నియోజకవర్గంలో ఈ విషయంపై సోమవారం దృష్టిపెడతానని ఎమ్మెల్యే నారాయణరెడ్డి చెప్పినట్లు తెలిసింది.
- వైపాలెం నియోజకవర్గంలో కొందరు నాయకులు నేరుగా అధిష్ఠానాన్ని సంప్రదించగా ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు చెబితేనే ఎంపిక జరుగుతుందని చెప్పటంతో అతనిని వ్యతిరేకిస్తున్న నాయకులంతా తర్జనభర్జన పడుతున్నారు.

కోయవారిపాలెంలో ఎలుగుబంటి కలకలం

కొండపి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెట్లూరు గ్రామ పంచాయతీ కోయవారిపాలెం గ్రామానికి సమీపంలోని పొలాల్లో ఎలుగుబంటి సంచరిస్తోందని ప్రచారం కలకలం రేపింది. చుట్టుపక్క గ్రామాల్లోనూ భయాందోళనలు నెలకొన్నాయి. రైతులు గ్రామానికి సమీపంలో మోటార్ల కింద పంటలు సాగు చేశారు. వీరి పొలాలకు సమీపంలో చిల్లచెట్లు, పొదలు ఉన్నాయి. సోమవారం ఉదయం పది గంటల ప్రాంతంలో పొలానికి వెళ్లారు. పొదల్లో నల్లగా ఎలుగుబంటి ఆకారం కనిపించగా భయంతో గ్రామంలోనికి పరుగులు తీశారు. తిరిగి గ్రామస్థులు గుంపుగా అక్కడకు వెళ్లి చూస్తే ఏమీ కనిపించలేదు. గ్రామస్థులతోపాటు, పరిసర గ్రామాలకు విషయం చేరడంతో అందరూ భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ముమ్మరంగా పొలం పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పొలం వెళ్లాలంటే రైతులు, కూలీలు భయపడుతున్నారు. పదేళ్ల క్రితం ఈ గ్రామానికి చెందిన మహిళ పశువుల్ని మేపుతుండగా అడవి పంది దాడిచేయడంతో మరణించింది. ఈ విషయాన్ని గుర్తుచేసుకుని కోయవారిపాలెం గ్రామస్థులు గడగడలాడిపోతున్నారు.

నృత్య సంకీర్తనం

ఒంగోలులోని మినీ స్టేడియంలో సోమవారం రాత్రి నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. బాలికల లయబద్ధమైన నృత్యం ఆహూతులను అలరించింది. ఆధ్యాత్మిక గురువు కొండవీటి జ్యోతిర్మయి అన్నమయ్య సంకీర్తనలు శ్రవణానందాన్ని కలిగించాయి.

8




కోడి పందేలకు సిద్ధం చేసి ఉన్న పుంజులు

కోడి పందేలు.. షరామామూలే

నేడు, రేపు భారీగా జరిగే అవకాశం

ఒంగోలు క్రైం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలుచోట్ల కోడి పందేల బరులు నడిచాయి. పందేల నిర్వహణపై కలెక్టర్, ఎస్పీ సీరియస్‌గా హెచ్చరికలు చేసినప్పటికీ ఎవరి పని వారిదే అన్నట్లుగా నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో తీర ప్రాంతంలో ఇప్పటికే అనేకచోట్ల బరులను సిద్ధం చేశారు. సోమవారం సంతనూతలపాడు చిన్న చెరువులో భారీగా బరి ఏర్పాటు చేసి 200 కోళ్లతో పందేలు వేయగా, పై పందెం రూ.లక్షల్లో జరిగినట్లు తెలుస్తోంది. అయితే భోగి పండుగ సందర్భంగా కొన్నిచోట్ల బరులు లేకుండా తాత్కాలిక పందేలు వేశారు. చీమకుర్తి మండలం మంచికలపాడు శివారులో కోడిపందేలు జోరుగా సాగాయి. ఇంకా సంతనూతలపాడు మండలం మద్దులూరు-మాచవరంలో పందెం వేశారు. కొత్తపట్నం మండలంలో కొన్నిచోట్ల, టంగుటూరు, నాగులుప్పలపాడు, సింగరాయకొండ ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో పందేలు వేసేందుకు బరులను సిద్ధం చేసినట్లు సమాచారం. ఒంగోలురూరల్ మండలంతోపాటు పట్టణ పరిసరాలలో కూడా పందేలు వేసేందుకు కోళ్లు సిద్ధం చేశారు. ప్రజాప్రతినిధులు పోలీసులపై ఒత్తిడి తెచ్చి పందేలు వేయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఊరూవాడా పండుగే

(7వ పేజీ తరువాయి)

తరలి రాగా ఇతర ఉద్యోగులు, వ్యాపారాలు, ఇతరత్రా పనుల్లో వారు పండుగకు వస్తున్నారు. అలా పెద్ద సంఖ్యలో వచ్చిన వారితో గ్రామాల్లో మరింత సందడి వాతావరణం నెలకొనగా పట్టణ ప్రజానీకం కూడా ఉత్సాహంగానే సంక్రాంతి వేడుకలను నిర్వహించుకుంటున్నారు.

ఉత్సాహంగా భోగి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా భోగి పండుగ ఉత్సాహంగా సాగింది. మహిళలు తెల్లవారుజాము నుంచే చలిమంటలు, ఆ తర్వాత పండి వంటలు, పూజా కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. పలుచోట్ల సాయంత్రం పెద్దఎత్తున వివిధ సంస్థలు, స్థానిక యువకులు వారి కోసం ముగ్గుల పోటీలు పెద్దఎత్తున నిర్వహించడంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లో కబడ్డీ, క్రికెట్, ట్రాక్టర్ రివర్స్, ఎడ్లు, పొట్టేళ్ల పందేలు వంటివి జోరుగా సాగుతున్నాయి. మంగళ, బుధవారాల్లో సంక్రాంతి వేడుకలను మరింత ఉత్సాహంగా నిర్వహించుకోనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో జిల్లాలోని కొన్నిచోట్ల పేకాట, కోడిపందేలు, ఇతర జూద కార్యక్రమాల నిర్వహణపై కూడా కొందరు దృష్టిసారించినట్లు తెలుస్తోంది.

జోరుగానే వ్యాపారాలు

సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణాల్లో వివిధ రకాల వ్యాపారాలు కూడా జోరుగానే సాగుతున్నాయి. ప్రధానంగా వస్త్రాలు, చెప్పులు, ఇతర హోమ్‌నీడ్స్‌తో పాటు సరుకుల వ్యాపారం కూడా అధికంగానే సాగింది. పండుగ వేళ పండి వంటల వ్యాపారం కూడా అధికంగానే ఉంది. గతంలో ఇళ్ల వద్ద పలు రకాల పిండివంటలు చేసేవారు. వారం రోజులు ముందు నుంచే తయారీ ప్రక్రియ సాగుతుండేది. మారిన సామాజిక పరిస్థితులలో అది కొంతమేర తగ్గింది. పల్లెల్లో ఒక మోస్తరుగా ఉన్నా పట్టణాల్లో ఇళ్ల వద్ద తయారీ తగ్గిపోయింది. దీంతో ఆ మేరకు పట్టణాల్లో పిండివంటల కొనుగోళ్లు పెరిగాయి. నూతన సంవత్సర వేడుకల సమయంలో వీధుల్లో కేక్‌లు, బొకేలు పెట్టి అమ్మకాలు చేసినట్లు సంక్రాంతి వేళ వివిధ రకాల పిండివంటలను వ్యాపారులు విక్రయిస్తున్నారు.

సహకారంపై కుస్తీ!

(7వ పేజీ తరువాయి)

నిధులు ఇస్తే వారే పదవి తీసుకోవాలని ఒకవర్గం ప్రతిపాదించినట్లు తెలిసింది. మరో వర్గం వారు ఆ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు. బల్లికురవ సొసైటీ పరిధిలో ఇద్దరు, ముగ్గురు నాయకుల మధ్య నెలకొన్న పోటీని కిందిస్థాయి నాయకులు నివారించలేకపోయారు.

ఏకాభిప్రాయం కోసం యత్నాలు

- పర్చూరు నియోజకవర్గంలో కూడా నాలుగు సొసైటీల్లో పోటీ తీవ్రంగా ఉంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఏకాభిప్రాయం కోసం ప్రయత్నం చేస్తున్నారు.
- ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో 20 సొసైటీలు ఉండగా చీమకుర్తి మండలంలో ఐదింటికి స్థానిక నాయకులతో మాట్లాడి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ జాబితాను సిద్ధం చేశారు. వారిలో పల్లామల్లి, కేవీ పాలెం సొసైటీల పీఏసీ పదవులకు ఎమ్మెల్యే ఎంపిక చేసిన వారు తాము సిద్ధంగా లేమని చెప్పినట్లు తెలిసింది.
- మద్దిపాడు మండలంలో నందిపాడు సొసైటీకి నాగేశ్వరరావు పేరు ఖరారుచేయగా దొడ్డవరం సొసైటీకి ముగ్గురు పోటీపడుతున్నారు.
- ఎస్ఎన్‌పాడు మండలంలో పలు సొసైటీల్లో నాయకుల మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో అన్నిచోట్లా పదవులపై తానే నిర్ణయం తీసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. దీనిపై మండల పార్టీ అధ్యక్షుడు మరికొందరు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది.
- ఎన్‌జీపాడు మండలంలో ఆయా సొసైటీలకు ఇటు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అటు మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి అనుచరుల మధ్య పోటీ తీవ్రస్థాయికి చేరింది.

అక్కడక్కడా అలకలు

- కొండపి నియోజకవర్గంలో 17 సొసైటీలు ఉండగా ఇటు మంత్రి స్వామి అటు మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య బిజీగా ఉండటంతో దామచర్ల పూర్ణచంద్రరావు అన్ని సొసైటీల్లో ఏకాభిప్రాయం కోసం కసరత్తు చేస్తున్నారు.
- కందుకూరు నియోజకవర్గంలో ఏకాభిప్రాయం కోసం ఎమ్మెల్యే నాగేశ్వరరావు చేసిన ప్రయత్నాలు కొన్నిచోట్ల ఫలించలేదు. దీంతో ఎమ్మెల్యే ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ కొందరు లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు.

ఆనందరసభరితం.. అన్నమయ్య సంకీర్తనం

అలరించిన కొండవీటి జ్యోతిర్మయి

ఘనంగా అన్నమయ్య సంగీత విభావరి

హాజరైన పలువురు ప్రముఖులు

భారీగా తరలివచ్చిన ప్రజలు

ఒంగోలు కల్చరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, నాగసత్య లత దంపతులు డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రముఖ గాయని, ఆధ్యాత్మిక గురువు కొండవీటి జ్యోతిర్మయి అన్నమయ్య సంకీర్తనా విభావరి ప్రేక్షకులను తన్మయత్వంలో ముంచింది. మినీ స్టేడియంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, పలువురు ఎమ్మెల్యేలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మిక పథంలో పయనించటం ద్వారా సమాజంలో శాంతి సౌభాగ్యాలు విలసిల్లుతాయని, అటువంటి వాటికి అన్నమయ్య సంకీర్తనల వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన శాసనసభ్యులు దామచర్ల దంపతులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మినీ స్టేడియం వేలాదిమంది ప్రేక్షకులతో నిండిపోయింది. అనంతరం కొండవీటి జ్యోతిర్మయి ముందుగా అన్నమయ్య సంకీర్తనల విశిష్టతను వివరించి అనంతరం పలు సంకీర్తనలను రసరమ్యభరితంగా గానం చేశారు. ప్రజలు వేలాదిగా తరలిరావటంతో ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసు శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.



హాజరైన అశేష జనవాహిని



ఎమ్మెల్యే జనార్దన్‌తోపాటు మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వైభవంగా గోదా కల్యాణం

సింగరాయకొండ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన మండలంలోని పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని వైభవంగా గోదా కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయంలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గోదా కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా భోగి పండుగ వేడుకలు



ఎమ్మెల్యే జనార్దన్ ఆధ్వర్యంలో ఆయన ఇంటి వద్ద భోగిమంటలు



మాజీమంత్రి శిద్దా ఆధ్వర్యంలో భోగి మంటలు

పాల్గొన్న పలువురు ప్రముఖులు

నేడు మకర సంక్రాంతి

ఒంగోలు కల్చరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : భోగిపండుగను జిల్లావ్యాప్తంగా ప్రజలు సోమవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. సోమవారం తెల్లవారుజామునే నిద్ర లేచి ఇళ్లముందు భోగిమంటలు వేసి సందడి చేశారు. ఇక భోగిమంటలతో ఒంగోలు నగరంలో యువకులు ఉత్సాహంగా గడిపారు. స్థానిక లాయర్‌పేట సాయిబాబా మందిరం దగ్గర లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోగిసంబరాలను రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతికి సంక్రాంతి పండుగ అద్దం పడుతుందని అటువంటి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేరళ వాయిద్యాలు, కథాకళి, భరతనాట్యం, వెస్ట్రన్ డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ చలువాది శ్రీహరి, పువ్వాడ రాజేష్, కూరపాటి రమేష్, దుగ్గిరెడ్డి తిరుపతి రెడ్డి, పల్లపు సుబ్బయ్య, సోమినేని సురేష్, చిట్టెం రెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అటు స్థానిక కమ్మపాలెం ఎన్టీఆర్ బొమ్మ దగ్గర భోగిపండుగ వేడుకలు, సంక్రాంతి ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి అటు స్థానిక ద్వారకానగర్‌లో మహిళా విభాగం ఆధ్వర్యంలోనూ ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. ఇక చెన్నకేశవనగర్ ఎన్టీఆర్ పార్కుదగ్గర భోగిమంటల కార్యక్రమం ఘనంగా జరిగింది.

నేడు సంక్రాంతి పండుగ

సంవత్సరంలో అతి పెద్ద తెలుగు వారి పండుగ సంక్రాంతిని ప్రజలు మంగళవారం జరుపుకోనున్నారు. ఈ సంక్రాంతి పర్వదినంతో దక్షిణాయణం ముగిసి ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. ఈ పండుగ కోసం దేశ విదేశాల్లో ఉన్న జిల్లావాసులు ఇప్పటికే తమ తమ గ్రామాలు, ఊళ్లకు చేరుకోవటంతో సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి పండుగను ఘనంగా ఉత్సాహంగా నిర్వహించుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

కనులపండువగా తెప్పోత్సవం

కమనీయంగా గోదా రంగనాయక స్వామి కల్యాణ మహోత్సవం

చీమకుర్తిలో అట్టహాసంగా సంక్రాంతి వేడుకలు

చీమకుర్తి, జనవరి13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి వేడుకలు చీమకుర్తిలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో వేంచేసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న పుష్కరిణిలో తెప్పోత్సవం దేదీప్యమానంగా జరిగింది. కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేతలు శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా హనుమంతరావు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన వేడుకల్లో కుటుంబసభ్యులు పాల్గొని విశేషపూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ వద్ద నిర్వహించిన సాంస్కృతిక వేడుకలు ఆహూతులను విశేషంగా అలరించాయి. చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో నిర్వహించిన గోదా రంగనాయకస్వామి కల్యాణ మహోత్సవంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. భోగి పండగ సందర్భంగా చీమకుర్తి వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గోదాదేవి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు పరాంకుశం శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో టీటీడీ ఆగమ పండితులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. పట్టణంలోని బూచేపల్లి ఇంట జరిగిన భోగి పర్వదిన వేడుకల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులను అందజేశారు.



కె.అగ్రహారం పుష్కరిణిలో తెప్పోత్సవం

రేపటి నుంచి నాటికల పోటీలు

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం అనంతవరం గ్రా మంలో బుధవారం రాత్రి స్వర్గీయ పెడవల్లి కామేశ్వరరావు కళా ప్రాంగణంలో ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీ య ఉభయ తెలుగు రా ష్ట్రాల నాటిక పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ నాటిక పోటీలకు ముఖ్య అతిథిగా అమరావతి జేఏసీ కన్వీనర్ పువ్వాడ సుధాకర్ పాల్గొంటున్నారు. రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు జనాబ్ మహమ్మద్ షరీఫ్‌కు కళాపరిషత్ సభ్యులు సన్మానం చేయనున్నారు. కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీల కోసం వేదికను సుందరంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాత్రి సమయాలలో మంచు కురుస్తున్నందువలన నాటిక పోటీలను తిలకించడానికి వచ్చే ప్రేక్షకులకు ఇబ్బందులు కలగకుండా షామియానాలను ఏర్పాటుచేస్తున్నారు. వరుసగా నాలుగురోజులు నాటికలను ప్రదర్శిస్తారు.



నాటికల ప్రదర్శనకు సిద్ధమవుతున్న వేదిక

ప్రదర్శించే నాటికలు

బుధవారం రాత్రి సభాకార్యక్రమం అనంతరం మొదటిగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే స్వేచ్ఛ నాటికను ప్రదర్శిస్తారు. తరువాత న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారిచే ఐ ఏట్ ఇండియా నాటికను, తర్వాత మూడవ నాటికగా శ్రీసద్గురు కళా నిలయం గుంటూరు వారిచే కమనీయం నాటికను ప్రదర్శిస్తారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నాగులుప్పలపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన హనుమాపురం సమీపంలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు చీమకుర్తి మండలం మంచికలపాడు గ్రామానికి చెందిన అంగటి పోలయ్య సోమవారం రాత్రి నాగులుప్పలపాడు నుంచి స్వగ్రామానికి తన ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో బినిడ మానూరు - హనుమాపురం గ్రామాల మధ్య బైకు అదుపుతప్పింది. దీంతో పోలయ్య రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

అవీఇవీ



షటిల్ బ్యాడ్మింటన్ విజేతలు

సంతనూతలపాడు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్లోని ఇండోర్‌స్టేడియంలో రెండు రోజులు జరిగిన డబుల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారంతో ముగిశాయి. పోటీలను తొలుత ఎస్సై వి.అజయ్‌బాబు ప్రారంభించారు. 30 టీములు పోటీల్లో పాల్గొన్నాయి. టోర్నమెంట్‌ను బి.వెంకట్రావు, కే.రజనీకాంత్, బి.యలమందరావు, తదితరులు పర్యవేక్షించారు. విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను దాతలు పొన్నం భాస్కరరావు రూ.7,116లు, బ్యాంకు ఉద్యోగి ఆబోతు అశోక్ రూ.5,116లు, నంది రెస్టారెంట్ అధినేత బి.యలందరావు రూ.3,116లను అందించగా వాటిని ఆయా విజేతలకు అందజేశారు. కార్యక్రమంలోమాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీను, చెరుకూరి వెంకట సుబ్బయ్య, బి.శంకర్, సీహెచ్.శ్రీను, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలకు అవకాశం కల్పించాలి



మంత్రి స్వామికి బొకే ఇస్తున్న ప్రధానోపాధ్యాయులు

ఒంగోలు విద్య, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఉపాధ్యాయుల బదిలీల్లో 2023లో ఉద్యోగోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులకు అవకాశం కల్పించాలని హెచ్‌ఎంలు కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామిని ఆయన స్వగ్రామంలో కలిసి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. టీచర్ల బదిలీల ముసాయిదా చట్టంలో మే 31వతేదీని కటాఫ్ తీసుకుంటే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అందువల్ల బదిలీల్లో తమకు నష్టం జరగకుండా చూడాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి స్వామికి బొకే ఇచ్చి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పఠాన్ మహబూబ్‌ఖాన్, యాతం శ్రీనివాసరావు, ఎల్. శ్రీనివాసరావు, పి. కృష్ణ ప్రసాద్, రామిరెడ్డి, రాఘవ, సునన్నకుమార్, షేక్ మీరావలి, ఇందిరా తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వారం కిందట ప్రమాదం



రాజ్యలక్ష్మి(ఫైల్)

పర్చూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కుమార్తెలు సజీవ దహనమైన ఘటన తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లి దాసరి రాజ్యలక్ష్మి (50)ఆదివారం రాత్రి మృతి చెందారు. స్థానిక తూర్పువారివీధిలో ఉంటున్న రాజ్యలక్ష్మి కుటుంబం ఈనెల 5 అర్ధరాత్రి ఇంట్లో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు కుమార్తెలు నాగమణి(34), మాధవీలత(30) మృతి చెందారు. మంటల్లో కాలిపోతున్న కుమార్తెలను రక్షించే క్రమంలో తీవ్రంగా గాయపడిన రాజ్యలక్ష్మిని గుంటూరుకు తరలించారు. ఇద్దరు కుమార్తెలు, భార్య మృతి చెందడంతో రాజ్యలక్ష్మి భర్త, మతిస్థిమితం లేని కుమారుడి పరిస్థితి దయనీయంగా మారింది. అమ్మ, అక్కా, చెల్లి మృతి చెందిన విషయం కూడా తెలియని పరిస్థితిలో ఆ యువకుడు ఉండడం అందరినీ కలచివేస్తోంది.

పండగపూట ఘోరం

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

హాస్పిటల్ వద్ద మిన్నంటిన రోదనలు



మనోహర్ జోష్(ఫైల్)

చీరాలటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పండుగనాడు ఓ కుటుంబం కుమారుడిని కోల్పోయింది. దీంతో తల్లిదండ్రులు, బంధువుల రోదన చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద మిన్నంటింది. వివరాల్లోకి వెళితే ..చినగంజాం మండలం మోటుపల్లి పంచాయతీ నిరీక్షణగిరికు చెందిన పొన్నపూడి అబ్రహం మత్స్యకారుడు. ఇతనికి భార్య సుజాతతోపాటు పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పెద్ద కుమారుడు మనోహర్ జోష్(15), ఏడవ తరగతి చదువుతున్న రత్నకుమార్ సంతానం ఉన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కఠారిపాలెంకు చెందిన పెదనాన్న సీతారామయ్య మరికొందరు బంధువులతో కలిసి సోమవారం రాత్రి షాపింగ్‌కు రెండు ద్విచక్రవాహనాలపై కఠారిపాలెం నుంచి వేటపాలెం వెళుతున్నారు. మిగిలిన వారు మరో వాహనంపై వెళుతుండగా మనోహర్, కొండూరి గోపయ్య ఒక బైక్‌పై వెళుతున్నారు. అయితే ఇంటి నుంచి బయలుదేరిన వీరి వాహనాన్ని పదినిముషాల వ్యవధిలోనే కఠారిపాలెం గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు వేగంగా ఢీకొన్నాడు. ఘటనలో మనోహర్ అక్కడికక్కడే మృతి చెందగా, గోపయ్యకు తీవ్ర గాయాలు కావడంతో ముందుగా చీరాల్లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. అయితే కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువుల హాస్పిటల్ వద్దకు చేరుకుని బోరున విలపించారు.

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం

అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థాన అల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అద్దంకి లోని భవానీ సెంటర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో నెల రోజుల నుంచి చిన్న జీయర్‌స్వామి శిష్యురాలు స్వర్ణ అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న తిరుప్పావై ప్రవచనాలు సోమవారం ముగిసాయి. సోమవారం భోగి పండుగ సందర్భంగా గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో గుంటూరు నాగేశ్వరరావు, చల్లగుండ్ల సాయిబాబా దంపతులు, స్వర్ణ వెంకటసుబ్బారావు, పోతేపల్లి రాము, కొండముది బాపూజీ, సోడా వెంకటేశ్వర్లు, గుంటూరు జయమ్మ, చల్లగుండ్ల సుబ్బాయమ్మ, జయశ్రీ, కొండముది ఆంజనేయులు పాల్గొన్నారు.



ప్రవచనాలను చెబుతున్న స్వర్ణ అన్నపూర్ణ

పోటాపోటీ

పొట్టేళ్ల బలప్రదర్శన పోటీలు



మొదటి బహుమతి గెలుచుకొన్న ఉప్పుటూరుకు చెందిన పొట్టేళ్ల జత యజమానులు

ఉప్పుటూరుకు ప్రథమ బహుమతి


నాగులుప్పలపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలోని ఊరచెరువులో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల స్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో ఉప్పుటూరుకు చెందిన పొట్టేలు సత్తా చాటి విజేతగా నిలిచింది. పోటీలను తిలకించేందుకు వచ్చిన అశేష జనవాహిని కేరింతలు, ఉత్సాహం, చప్పట్లు నడుమ పొట్టేళ్ల బలప్రదర్శన సాగింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 32 పొట్టేళ్లు బల ప్రదర్శనలో పాల్గొన్నాయి. నిర్వాహకులు రెండు రౌండ్లుగా పోటీలను నిర్వహించారు. ఉప్పుటూరు గ్రామానికి చెందిన ఉప్పుటూరి పోలేరమ్మకు చెందిన పొట్టేలు మొదటి బహుమతి, ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన మద్దిసాని సుబ్బారావు పొట్టేలు రెండవ బహుమతి, ఎనికపాడుకు చెందిన యద్దనపూడి వెంకటేష్‌కు చెందిన పొట్టేలు మూడవ బహుమతి ,చిన గంజాం దీరకు చెందిన పొట్టేలు నాల్గవ బహుమతి సాధించాయి. తొలుత సేవా సమితి సభ్యులు గ్రామంలో పోటీల జ్యోతి ప్రజ్వలన, ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ నెల 18 న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బహుమతి ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఉప్పుగుండూరులో పొట్టేళ్ల పోటీలను తిలకిస్తున్న జనం

మల్లాయపాలెంలో కోడి పందేలు

బరి చూసేందుకు పెద్ద ఎత్తున వచ్చిన ప్రజలు



పందెం బరి వద్ద యువకులు

బల్లికురవ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మల్లాయపాలెంలో సంక్రాంతి పండుగలో భాగంగా కొందరు యువకులు గుట్టు చప్పుడు కాకుండా కోడి పందేల బరిని ఏర్పాటు చేసి యథేచ్ఛగా పందేలను సోమవారం నిర్వహించారు. గ్రామానికి ఉత్తరం వైపున ఉన్న కొండ ప్రాంతంలో పందెం బరిని ఏర్పాటు చేసి కోళ్లను తీసుకు వచ్చి నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పందేలు జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. సాయంత్రానికి విషయం అందరికీ తెలిసి పెద్ద ఎత్తున చర్చ జరగడంతో పోలీసులు అక్కడికి చేరే సరికి పందెం నిర్వాహకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు వచ్చి పందేలు ఆడినట్లు తెలిసింది. మూడు రోజుల నుంచి మల్లాయపాలెంలో బరి మార్చి మార్చి పందేలు వేస్తున్నట్లు తెలిసింది. సోమవారం పందెంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు సమాచారం. మంగళ, బుధ వారాలలో కూడా కోడి పందేలు జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. పోలీస్ శాఖ ఎలా స్పందిస్తుందో చూడాలి.

ఆసక్తికరంగా క్రికెట్ పోటీలు

సెమీస్‌కు చేరినజట్టు



సిక్సర్ కొడుతున్న బ్యాట్స్‌మన్

మేదరమెట్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్వర్యంలో జరుగుతున్న శ్రీ భమర సంక్రాంతి కప్-2025 క్రికెట్ పోటలు ఆసక్తికరంగా జరుగుతున్నాయి. సోమవారం జరిగిన పోటీలలలో సౌత్ జౌన్ సీసీ చెన్నై, ఎస్‌కేఎం సీసీ లెవన్ జట్లు విజయం సాధించాయి. సోమవారం ఉదయం ఏలూరిస్ సౌత్ జోన్ సీసీ లెవన్, ఇండియన్ బ్యాంక్స్ చెన్నై జట్ల మధ్య పోటీ జరిగింది. ఇండియన్స్ బ్యాంక్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఏలూరిస్ సౌత్ జోన్ చెన్నై జట్టు నిర్ణీత 20ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 163 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇండియన్ బ్యాంక్స్ జట్టు 19.3 ఓవర్లలో 146 పరుగులకు ఆల్ అవుట్ అయింది. సౌత్ జోన్ జట్టులోని పార్థసారథి 24 బంతులలో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 30 పరుగులు సాధించాడు. నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 25 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీశాడు. ఇండియన్ బ్యాంక్స్‌లోని బ్యాట్‌మన్ ప్రణవ్ 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 57 పరుగులు సాధించి నాట్ అవుట్‌గా నిలిచాడు. ఏలూరి సౌత్ జోన్ జట్టు 17 పరుగుల తేడాతో ఇండియన్స్ బ్యాంక్స్ జట్టుపై విజయం సాధించింది.

సాయంత్రం జరిగిన పోటీలలో ఎస్‌కేఎం సీసీ లెవెన్ జట్టు చెన్నై జట్టు, జీఎస్‌టి సెంట్రల్ ఎక్సైజ్ జట్లు పోటీ పడ్డాయి. ఎస్‌కేఎంసీసీ లెవెన్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 19.4 ఓవర్లలో 175 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీఎస్‌టీ జట్టు 11.5 ఓవర్లలో 63 పరుగులకే ఆల్ అవుట్ అయింది. ఎస్‌కేఎం సీసీ జట్టులోని ఆల్ రౌండర్ రాజాలింగం 16 బంతులల్లో 6 సిక్స్‌లతో 43 పరుగులు సాధించాడు. అనంతరం 2 ఓవర్లు వేసి 2 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశాడు. ఎస్‌కేఎంసీసీ లెవెన్ చెన్నై జట్టు 112 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ పోటీలకు ఎంపైర్‌లుగా శ్రీనివాస్, రాజాలు, స్కోరర్‌గా సాయిరాజ్ వ్యహరించారు.

నేటి సెమీస్ పోటీలు



సంక్రాంతి కప్ పోటీలలో సోమవారం వరకు 16 జట్లు మధ్య జరగ్గా, నాలుగు జట్లు సెమీ ఫైనల్‌కు చేరాయి. మంగళవారం ఉదయం జీడీసీఏ లెవెన్ గుంటూరు, ఏలూరీస్ సౌత్ జోన్ సీసీ జట్ల మధ్య పోటీ జరుగుతుంది. సాయంత్రం ఎంఆర్‌సీసీ చెన్నై, ఎస్‌కేఎం సీసీ చెన్నై జట్ల మధ్య పోటీ జరుగుతుందని ఆర్ఎస్‌సీఏ అధ్యక్ష, కార్యదర్శులు కారుసాల నాగేశ్వరరావు(బాబు), మోపర్తి శేషు తెలిపారు.

సుఖసంతోషాలతో సంక్రాంతి జరుపుకోవాలి

ఎస్పీ దామోదర్



ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), జనవరి13 (ఆంధ్రజ్యోతి): సుఖసంతోషాలతో సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ నివాసంలో భోగి పండుగ సందర్భంగా భోగిమంటల వేసి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సంబంధాలు మెరుగు పడే విధంగా స్నేహితులు, బంధువులు కలిసి జరుపుకునే పండుగను ప్రశాంతంగా సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు.

విద్యుత్ తీగల్లో చిక్కుకున్న గాలిపటం తీస్తూ షాక్

బాలుడికి విద్యుదాఘాతం

ఒంగోలు(క్రైం),జనవరి13(ఆంధ్రజ్యోతి):సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటం ఎగుర వేసిన బాలుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ ఘటన సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట శాంతి నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే 12 ఏళ్ల బాలుడు ఆర్.అవినాష్ గాలిపటాన్ని తన ఇంటి పైకి ఎక్కి ఎగురవేశాడు. అయితే పక్కనే ఉన్న విద్యుత్‌తీగల లో గాలిపటం చిక్కుకుంది. దాన్ని తీసే క్రమంలో అందుబాటులో ఉన్న ఇనుపచువ్వను వినియోగించాడు. దీంతో తీవ్ర షాక్‌కు గురైయిన బాలుడు శరీరం సగానికి పైగా కాలిపోయింది. ఈమేరకు ఒంగోలులోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలించారు.

పంచాయతీలకు అధికారాలు అప్పగింతపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు ఉన్న అధికారాలను పంచాయతీ, మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థలకు అప్పగిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జీ వీరభద్రాచారి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల స్థానిక సంస్థలకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాలను కాపాడటంతో పాటు ఆదాయం పెరుగుతుందన్నారు. గత ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యలను అనేక సార్లు తీసుకెళ్లినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థలకు అధికారాలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.



ఉలిచిలో వాలీబాల్ పోటీలో యువకులు

ఉలిచిలో ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ఒంగోలు(రూరల్)జనవరి13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం ఉలిచి గ్రామంలో, ఒంగోలు నగరపరిధిలోని కొప్పోలు గ్రామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఉలిచి గ్రామంలో వాలీబాల్ పోటీలు , ముగ్గుల పోటీలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. అదేవిధంగా కొప్పోలు గ్రామంలో విద్యార్థులకు స్లోసైక్లింగ్ పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు, కుర్చీలాటలు, యువకులకు క్రికెట్ పోటీలు జరిగాయి. విజేతలకు గ్రామనాయకులు ,పెద్దలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కడలిపుత్రులు.. కట్టుబాట్లు

నేటికీ కాపుల తీర్పుకు ప్రాధాన్యత

సముద్ర తీర ప్రాంతంలో మత్స్యకారుల జీవనస్థితిగతులు విచిత్రం

చీరాల (ఆంధ్రజ్యోతి)

కడలినే నమ్ముకున్న కష్టజీవులు. గంగమ్మ తల్లి ముద్దుబిడ్డలు. సముద్రంలో వేట సక్రమంగా సాగితే వారికి పండుగ. లేదంటే బోటుకు వినియోగించే డీజిల్ ఖర్చులూ దండగే. వారే తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు. సముద్రంలో వేటకు బయలుదేరిన బోట్లు, వాటిపై ఎగిరే తెరచాపలు, హైలెస్సా, హైలెస్సా అంటూ మత్స్యకారుల కోరస్ గీతాలు తీరానికే వన్నెతెస్తాయి. ఇది బయటకు కనిపించే కోణం. అయితే నేటికీ మత్స్యకార గ్రామాల్లో గ్రామకాపుల తీర్పే అంతిమం. కులకట్టుబాట్లకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. వారి కట్టుబాట్లు, జీవనశైలిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



వేటకు సిద్ధంగా ఉన్న బోట్లు

- **కళాసీలు, సారంగుల మధ్య ఒప్పందాలు**

తీరప్రాంత మత్స్యకార గ్రామాల్లో ఎక్కువమంది సముద్రంలో మత్స్యసంపదను వేటాడటమే జీవనాధారం. చేపలను వేటాడుతూ కుటుంబాలను పోషిస్తుంటారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో వేట నిషేధం. ఆ సమయంలో మత్స్యసంపద పునరుత్పత్తి జరుగుతుంటుంది. ఏటా సముద్రంలో వేట పునఃప్రారంభానికి ముందు సారంగులు(బోటు యజమానులు), కళాసీలు(పనిచేసేవారు) మధ్య ఏడాది జీతభత్యాల ఒప్పందాలు జరుగుతాయి. ఆ ప్రకారం వేట జరిగే 10 నెలల కాలవ్యవధిలో అడుగులు వేస్తుంటారు.

- **గ్రామ కాపుల తీర్పునకు పెద్దపీట**

నేటికీ మత్స్యకార గ్రామాల్లో గ్రామ కాపుల తీర్పే అందరికీ శిరోధార్యం. ఆ తీర్పును గౌరవిస్తూ అందరూ నడుచుకుంటుంటారు. పోలీస్‌స్టేషన్లు, న్యాయస్థానాల కన్నా పెద్దల మాటకే పెద్దపీట వేస్తుంటారు. అనాదిగా వస్తున్న ఆచారాలకు నేటి తరం వారు కూడా దాదాపు కట్టుబడి ఉంటున్నారు.

- **కూత.. దురాయి...**


మత్స్యకార గ్రామాల్లో ఏదన్నా వివాదం తలెత్తితే పోలీస్‌స్టేషన్ల వరకు వెళ్లకుండానే దాని పరిష్కారానికి గ్రామ పెద్దలు కృషి చేస్తారు. దానికి సంబంధించి తీర్పు చెప్పాలంటే ముందస్తుగా ఆ గ్రామంలో కూత(దండోరా) వేస్తారు. నిర్ణీత ప్రదేశానికి గ్రామ కాపులు, గ్రామస్థులు చేరుకుంటారు. వాద, ప్రతివాదనలు విన్న తరువాత కాపులు చెప్పే తీర్పులో ఆర్థికపరమైన అంశం ముడిపడి ఉంటుంది. దాన్నే దురాయి(అపరాధ రుసుం లేదా జరిమానా) అంటారు. అలా వచ్చిన సొమ్మును ఆనాటి ఖర్చుకు కొంత, మిగిలిన మొత్తం గ్రామ ఉమ్మడి అవసరాలకు వినియోగిస్తుంటారు.

హద్దుమీరితే.. మత్స్యకార పెద్దలందరూ హాజరు

ఆయా గ్రామాల పరిధిలో నెలకొన్న వివాదాలను గ్రామ కాపుల సమక్షంలో పరిష్కారం కాకపోతే తీరప్రాంతంలోని ఇతర మత్స్యకార గ్రామాల పెద్దలు(కాపులు)ను పిలుచుకుంటారు. వారి సమక్షంలో ఇచ్చే తీర్పు అంతిమం అవుతుంది. దాన్ని వ్యతిరేకిస్తే కట్టుబాట్లు పేరుతో మరికొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునే పరిస్థితి నేటికీ ఉంది. ప్రస్తుతం యువతలో కొంత మార్పు వస్తుంది. ప్రజాస్వామ్య విలువలు, నిబంధనలు, పోలీస్‌స్టేషన్లు, న్యాయస్థానాలతో కలిగే ప్రయోజనాలపై పెద్దలకు అవగాహన కల్పిస్తున్నారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం కట్టుబాట్లకే ప్రాధాన్యత ఇవ్వడం విశేషం.

పెద్దల(కాపులు) మాటకు విలువుంటుంది

అవుల సాయికృష్ణ, మత్స్యకారుడు, రామాపురం, వేటపాలెం మండలం



మత్స్యకార గ్రామాల్లో పెద్దలు(కాపుల)మాటకు విలువ ఉంటుంది. ఆ మాట ప్రకారం నడుచుకుంటాం. అదే మాకు మంచిదిగా అనిపిస్తుంది. కట్టుబాట్లను పాటిస్తాం. కలసిఉంటాం. పనిని దైవంగా కొలుస్తాం. పంతాలు కూడా ఉంటాయి. హద్దులు దాటకుండా ఉంటాం. ఇటీవల కొంత మార్పులు జరుగుతున్నాయి.



విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు డిమాండ్ చేశారు. చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని భగత్‌విజ్ఞాన కేంద్రం వద్ద భోగి మంటల్లో విద్యుత్‌బిల్లులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో చీకటి శ్రీనివాసులు, జి. శ్రీనివాసులు, విశ్వసేన్, రామకృష్ణ, శ్రీధర్‌రావు, వాసరావు, కాలం సుబ్బారావు, తంబి శ్రీనివాసులు, సయ్యద్ హుస్సేన్, కే శ్రీనివాసరావు, బీవి రావు, దామా శ్రీని టీవిఆర్ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

దిబ్బలరోడ్డులో..

ఒంగోలు నగరంలోని 48.49 డివిజన్లశాఖల ఆధ్వర్యంలో స్థానిక దిబ్బల రోడ్డులో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లోవేసి దహనం చేశారు. సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు జి. రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో రమాదేవి, ఆదిలక్ష్మి, ఏ. లక్ష్మినారాయణ, ఎం. శ్రీనివాసుల కల్యాణి పాల్గొన్నారు.

పశుపోషకుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మూడు గోకులాలను ప్రారంభించిన దామచర్ల సత్య

జరుగుమల్లి, జనవరి13 (ఆంధ్రజ్యోతి): పశుపోషకుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో పనిచేస్తున్నదని ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. ఆయన సోమవారం మధ్యాహ్నం మండలంలోని రామచంద్రాపురంలో రెండు, చిర్రికూరపాడు గ్రామంలో ఒకటి పశుపోషకులు నిర్మించుకున్న గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా షెడ్ల నిర్మాణదారులు రావి నాగేశ్వరరావు, గొల్లపూడి శ్రీనివాసరావు, చిర్రికూరపాడుకు చెందిన రామారావులతో ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లోని రైతులు, పశుపోషకులతో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, రామచంద్రాపురం సర్పంచ్ రావి నాగేంద్రమ్మ, నాయకులు రావి నాగేశ్వరరావు, కొమ్మాలపాటి కృష్ణ, పాతూరి కోటేశ్వరరావు, దగ్గుమాటి సుబ్బారెడ్డి, గుండపనేని వెంకటేశ్వర్లు (జీవీ), అరికట్ల రమణయ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కె. నాగరాజు, ఈసీ సిహెచ్ కోటేశ్వరరావు, టీఏ సుభాని పాల్గొన్నారు.


జరుగుమల్లి మండలం రామచంద్రాపురం గ్రామంలో గోకులం పశువుల షెడ్డును ప్రారంభిస్తున్న దామచర్ల సత్య, నాయకులు

భోగి వేడుకల్లో మంత్రి స్వామి

టంగుటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని తన నివాసంలో సోమవారం జరిగిన భోగి వేడుకల్లో సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు.


తన ఇంటి వద్ద భోగి వేడుకల్లో మంత్రి స్వామి

ముందుగా ఆయన తన ఇంటి ముందు భోగి మంట వేసి సందడి చేశారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయన భోగి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి కానుకగా ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, చిరువ్యాపారులకు, కాంట్రాక్టర్లకు, పోలీస్ సిబ్బందికి బకాయిలు రూ.6,700 కోట్లు విడుదల చేశామన్నారు.

టంగుటూరులో

ఆనవాయితీగా వస్తున్న భోగి వేడుక వద్ద సందడి వాతావరణం నెలకొంది. తెలుగుదేశం పార్టీ ప్రధాన నాయకుల ఆధ్వర్యాన గ్రామం నడిబొడ్డున మస్తాన్‌దర్గా ప్రాంతంలో జరిగిన ఈ వేడుకకు గ్రామంలోని అన్ని ప్రాంతాల నుంచి జనం హాజరయ్యారు. టీడీపీ నాయకులు బెల్లం జయంత్‌బాబు, చదలవాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు. అక్కడే హరిదాసుల కీర్తనలు, ప్రవచనాలతో ఆ ప్రాంతం అంతా మారుమోగింది.

ఘనంగా భోగి

సంతనూతలపాడు : మండలంలో పలుగ్రామాల్లో భోగిపండుగ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ప్రజలు తెల్లవారుజామునే ఇంటిముందు భోగిమంటలతో సందడిచేశారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తూ పండుగజరుపుకునేందుకు వచ్చిన వారితో ఆయా గ్రామాలు సందడిసందడిగా మారాయి. భోగిమంటల అనంతరం సంతనూతలపాడులో ప్రజలందరు శివముక్కోటిని పురస్కరించుకుని సమీపంలోని త్రిపురాంతక స్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేకంగా పూజలు చేశారు.

నాగులుప్పలపాడులో

నాగులుప్పలపాడు : సంక్రాంతి పండుగ సందర్భంగా తొలి రోజు వచ్చే భోగి పండుగను మండల పరిధిలోని గ్రామాలలో సోమవారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. అర్ధరాత్రి నుంచే యువతీ,యువకులు కోలాహలంగా భోగి మంటలు వేసి కేరింతలు కొట్టారు. గ్రామాల్లోని నివాస గృహాల వద్ద, వీధులలో, వ్యాపార సముదాయాల వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటల సంబరాలు అంబరాన్నంటాయి.


ఉప్పుగుండూరులో భోగి మంటలు వేస్తున్న ప్రజలు

ద్వారకానగర్‌లో ముగ్గులపోటీలు

ఒంగోలు, కార్పొరేషన్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఒంగోలులోని ద్వారకానగర్‌లో ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. సోమవారం స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందమైన రంగవల్లులతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. కార్యక్రమంలో కార్పొరేటర్ తిప్పరమల్లి రవితేజ, ఆవుల శ్రీనివాసరావు నిర్వాహకులుగా వ్యవహరించగా, పలువురు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఒంగోలు ద్వారకానగర్‌లో వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న మహిళలు

సంతనూతలపాడులో

సంతనూతలపాడు : ఐద్వా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంతనూతలపాడులో సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలను ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాలరమాదేవి ప్రారంభించారు. పోటీల్లో పలువురు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్. మాలతి, నాగూర్‌బీ, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం కరవదిలో మాజీముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టీరామారావు 29వ వర్ధంతి సందర్భంగా నిర్వహించే మహిళా బీచ్ కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం కొప్పోలులో తెప్పోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి ఏడు గంటలకు రంగారాయుడు చెరువులో నిర్వహించే తెప్పోత్సవం, అనంతరం గద్దలగుంటలో జరిగే పారువేటలో పాల్గొంటారు.

కుల దూషణ కేసు నమోదు

నాగులుప్పలపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన పేరం రామచంద్రరావును అదే గ్రామానికి చెందిన అడపాల ఆదిశేషు కులం పేరుతో దూషించాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల మేరకు ఉప్పుగుండూరు గ్రామంలోని సొసైటీ కార్యాలయం ఎదురుగా నివశించే పేరం రామచంద్రరావు ఇంటి పక్కన ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేసిన అడపాల ఆదిశేషు ఇల్లు నిర్మించుకొంటున్నారు. ఆ క్రమంలో రామచంద్రరావుకు చూరు హక్కు వదలకుండా ఆదిశేషు కట్టిన గోడను తొలగించేందుకు ప్రయత్నించిన రామచంద్రరావును అసభ్య పదజాలంతో నిందించి కులం పేరుతో దూషించారని బాధితుడి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్ఐ బి. శ్రీకాంత్ ఆదివారం రాత్రి కుల దూషణ కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుడికి పూర్వవిద్యార్థుల సన్మానం

ఒంగోలు(రూరల్), జనవరి13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం ముక్తినూతలపాడు గ్రామంలో సోమవారం ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు బత్తిన సుధాకరరావుని గ్రామ పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పూర్వవిద్యార్థి కామేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్య బోధించిన ఉపాధ్యాయులను గుర్తు పెట్టుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మొలకలపల్లి శ్రీనివాసరావు, బొడపాటి అశోక్, చింతపల్లి చక్రపాణి ,చల్లాపల్లి రమేష్, గురుమూర్తి, సూదనగుంట శ్రీధర్, కొండ్రగుంట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడు బత్తిన సుధాకరరావు దంపతులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

ముక్తినూతలపాడులో వేడుకలు

ముక్తినూతలపాడు గ్రామంలో సోమవారం భోగి వేడుకలను గ్రామస్థులు వేడుకలుగా నిర్వహించారు.ఈ సందర్భంగా చెడుగుడు పోటీలు , మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందచేశారు.

క్యాలెండర్‌కే పండుగ పరిమితం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ కేవలం క్యాలెండర్‌కే పరిమితమైందని వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులపట్ల బాధ్యత లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు కనకారావు మాదిగ, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అంతరించిపోతున్న క్రీడలకు ప్రోత్సాహం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో అంతరించిపోతున్న సంప్రదాయ క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం డైఫీ, ఐద్వా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో స్థానిక వడ్డెపాలెంలో ఆటల పోటీలను సుబ్బారావు ప్రారంభించారు. ఈసందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, కబడ్డీ, గిరిలో కుండకొట్టుట, రన్నింగ్ తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

నాగులుప్పలపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొనడంతో యువకుడు గాయపడ్డాడు. ఈ సంఘటన ఉప్పుగుండూరు గ్రామంలోని 216 రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఒమ్మెవరం గ్రామానికి చెందిన నార్నె సురేష్ సోమవారం చవటపాలెంలోని అమ్మ మ్మ ఇంటికి వెళ్లేందుకు తన ద్విచక్రవాహనంపై బయలుదేరి ఉప్పుగుండూరు గ్రామంలోని మాచవరం రోడ్డు జంక్షన్ వద్ద 216 జాతీయ రహదారి దాటుతుండగా చీరాల వైపు వెళుతున్న లారీ ఢీకొంది. దాంతో బైక్‌పై నుంచి కిందపడి సురేష్ గాయపడ్డాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం 108 లో ఒంగోలు తరలించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తిమ్మసముద్రం గ్రామంలోని మర్రిచెట్టు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్ఐ బి. శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. 44 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నారు.

అవీ..ఇవీ

ఎస్టీయూ క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ, విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాన్సెప్ట్ క్యాలెండర్‌లో పొందుపర్చిన విజన్-2047కు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనాతీరును గమనించారు. అదేవిధంగా 10వ తరగతి విద్యార్థుల కోసం ఎస్టీయూ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను తయారు చేయడాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె.ఎర్రయ్య, కార్యదర్శి ఈ.హనుమంతరావు, మార్కాపురం, పెద్దారవీడు మండలాల అధ్యక్షులు టీవీ.రమణ, పగడాల మల్లికార్జునరావు, కార్యదర్శి రంగదీపక్, తర్లుపాడు మండల బాధ్యులు రాజారమేష్, రంగస్వామిరెడ్డి, నల్లబోతుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పత్రికతో సంఘ పోరాటాలకు బలం

- యూటీఎఫ్ డివిజన్ కార్యదర్శి బాలవెంకటరత్నం

పొదిలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఐక్య ఉపాధ్యాయ సంఘం బలోపేతానికి పత్రిక ఎంతో ఉపయోగపడుతుందని యూటీఎఫ్ పొదిలి డివిజన్ జిల్లా కార్యదర్శి పెమ్మని బాలవెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఐక్యఉపాధ్యాయ పత్రిక ప్రారంభ సంపాదకులు మైనేని వెంకటరత్నం వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికను ప్రతి ఉపాధ్యాయుడు చదివేవిధంగా ఉపాధ్యాయులకు సంబంధించిన సమాచారాన్ని, విద్యార్థులకు ఉపయోగపడే విషయాలను పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు పిల్లి రమణారెడ్డి, ఆ సంఘం నాయకులు సానికొమ్ము సత్యనారాయణరెడ్డి, పాలడుగు వెంకటేశ్వర్లు, బూదాల బుజ్జిబాబు, వెన్నెల మల్లిఖార్జున్, సురేష్, సుబాని, బాలకాశిరెడ్డి, ఓబులరెడ్డి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

గిద్దలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి విద్యార్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అప్పట్లో పేద విద్యార్థిగా ఉండి, అనంతరం పై చదువుల చదివి ఉన్నతమైన స్థానానికి ఎదిగిన షేక్ ఖాజావలి ప్రస్తుతం గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారిగా పని చేస్తున్నాడు. ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులకు కొండపల్లి బొమ్మలతో కూడిన బహుమతులు అందజేసి సత్కరించారు.

ఉర్దూ, అరబిక్ కోర్సులకు అడ్మిషన్లు

గిద్దలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అల్‌మదాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్త సంవత్సర ఉర్దూ, అరబిక్ కోర్సుల అడ్మిషన్లు సోమవారం గిద్దలూరులో ప్రారంభమయ్యాయి. విద్యార్హతతో సంబంధం లేకుండా ఏ వయస్సు వారైనా ఉర్దూ, అరబిక్ కోర్సులు నేర్చుకునేందుకు అడ్మిషన్లు పొందవచ్చని ఫౌండేషన్ చైర్మన్ రహీం తెలిపారు. ప్రతి ఆదివారం పట్టణంలోని బిలాల్ మసీదు ఆవరణలో క్లాసులు నిర్వహిస్తారన్నారు. ఉర్దూ, అరబిక్ భాష కోర్సులు పూర్తి చేసిన వారికి భారత ప్రభుత్వంచే గుర్తింపు పొందిన నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్ వారి సర్టిఫికేట్లు అందజేస్తారన్నారు. ఫిబ్రవరి 15వ తేదీలోగా ఆధార్ జిరాక్స్, 3 ఫొటోలతో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 7989261221 నంబరును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గుడిసె మహబూబ్‌భాషా, జామియా మసీదు ఇమామ్ మౌలానా అబ్దుల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

గిద్దలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమం రాచర్లలో నిర్వహించారు. ఈ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రహీమ్, జిల్లా కన్వీనర్ గుడిసె మహబూబ్‌భాషా, కోకన్వీనర్ పఠాన్ జఫ్రుల్లాఖాన్ కార్యక్రమానికి హాజరయ్యారు. సమాచార హక్కు చట్టం, భారత రాజ్యాంగంపై కనీస అవగాహన, ప్రజాస్వామ్యంలో పౌరుని పాత్ర అనే అంశాలపై ఐక్యవేదిక ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు రహీం ఈసందర్భంగా పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వేదిక ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, యానాదయ్య, ఆంజనేయులు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుగా మార్పు

పొదిలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది ఫిబ్రవరి నెలలో టైలర్స్ కాలనీలో మాగులూరి రవి అనే వ్యక్తి ఉరివేసుకొని మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పట్లో పొదిలి పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. అయితే 11 నెలల తరువాత ఈ కేసును ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుగా మార్పు చేసినట్లు ఎస్ఐ వేమన తెలిపారు. అప్పట్లో రవికి వేరే మహిళతో పరిచయం ఉందని వారి వేధింపులు తాళలేక బలవన్మారణానికి పాల్పడ్డాడని నీలం నాగేంద్ర అనే దళిత నాయకుడు తెలిపారు. పలుమార్లు పొదిలి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో సెప్టెంబరులో జిల్లా ఎస్పీ గ్రీవెన్స్‌లో సలోమి ఫిర్యాదు చేసిందన్నారు. స్పందించిన ఎస్పీ దామోదర్ ఎట్టకేలకు ఎస్సీఎస్టీ యాక్ట్‌గా కేసు నమోదు చేయించారని ఆయన తెలిపారు. విచారణాధికారిగా దర్శి డిఎస్పీ లక్ష్మీనారాయణను నియమించినట్లు చెప్పారు. ఈరోజు కేసును మార్పు చేసిన కాపీని రవి భార్య సలోమికి అందజేశారు.

పెంచిన విద్యుత్‌చార్జీలు తగ్గించాలి

మార్కాపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను, అదనపు సర్‌ఛార్జీలను తగ్గించాలని, ప్రజలపై మోపిన భారాలను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.సోమయ్యో డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ పిలుపుమేరకు స్థానిక భగత్‌సింగ్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, రాజ్యలక్ష్మీనగర్, మున్సిపల్ కార్యాలయం సమీపాల్లో ఏర్పాటు చేసిన భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను సోమవారం తగులబెట్టారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ప్రజలపై మోయలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాలను మోపుతోందన్నారు. ట్రూఅప్, ఫిక్స్‌డ్ ఎనర్జీ, ఎఫ్‌పీపీసీఏ వంటి అదనపు బాధుడుతో సామాన్య ప్రజల నడ్డి విరుగుతోందన్నారు. విద్యుత్ సంస్థల నష్టాలకు ప్రభుత్వాలే కారణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ ఛార్జీలను, అదనపు ఛార్జీలను భారీగా పెంచిందన్నారు. 2021 నుంచి 2024 వరకు గత ప్రభుత్వ విధానాల వలన వచ్చిన నష్టాలను ప్రజలు భరించాలని చెప్పడం భావ్యంకాదన్నారు. కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు డీకేఎం రఫీ, సభ్యులు జవ్వాజి రాజు, ఎస్‌కే నన్నేసా, షేక్ మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.







త్రిపురాంతకంలో గోదా రంగనాయకస్వామి, గిద్దలూరులో వాసవీ అమ్మవారు, కంభంలో కల్యాణం కోసం వస్త్రాలు సమర్పిస్తున్న మహిళలు, పూజలందుకుంటున్న వేంకటేశ్వరుడు, కొమరోలులో లక్ష్మీనారాయణస్వామి

వైభవంగా భోగి పర్వదినం

- పలు ఆలయాల్లో గోదాదేవి కల్యాణం
- పూజల్లో పాల్గొన్న మహిళలు, భక్తులు

గిద్దలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భోగి పర్వదినాన్ని ప్రజలు వేడుకగా నిర్వహించుకున్నారు. సోమవారం తెల్లవారుజామునే వీధుల్లో భోగిమంటలు వేశారు. కుటుంబాల వారు ఒకచోట అందరూ కలిసి ఉమ్మడిగా భోగిమంటలు వేసుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం భోగి పర్వదినం, అలాగే సోమవారం, ఆరుద్ర నక్షత్రం, పౌర్ణమి ఒకే రోజు రావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివునికి పంచామృతాభిషేకాలు చేశారు. భోగి పండ్లతో అభిషేకం చేశారు. పలు ఆలయాల్లో అన్నాభిషేకం చేశారు. అమ్మవారిశాలలో భోగిపర్వదినం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం చిన్నారులకు తల్లిదండ్రులు, బంధుమిత్రుల మధ్య భోగిపండ్లు పోసి వేడుకలు నిర్వహించారు. రాచర్ల మండలం అనుమలవీడులో భోగి పర్వదినం సందర్భంగా సోమవారం రాత్రి నంది అవార్డు గ్రహీతలతో చింతామణి పౌరాణిక ఉచిత నాటకాన్ని ప్రదర్శించారు.

త్రిపురాంతకం : ధనుర్మాసం సందర్భంగా నెల రోజుల నుండి పూజలు చేస్తున్న భక్తులు భోగి సందర్భంగా గోదా రంగనాయకస్వామి కల్యాణం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎన్నెస్పీ కాలనీలోని వేంకటేశ్వరాలయంలో అర్చకులు ఎం.రామశ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. అర్చకులు కె.రవి ఆధ్వర్యంలో పాతరామాలయం వద్ద వేంకటేశ్వర కళ్యాణాన్ని నిర్వహించారు. వేదమంత్రాల నడుమ కళ్యాణాన్ని, ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

పొదిలి : మండలంలో అన్ని గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం భోగి సంబరాలు అంబరాన్నంటాయి. సంప్రదాయ బద్ధంగా గ్రామీణులు భోగి పండుగను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. తెల్లవారుజామునే లేచి ప్రతి ఇంటిముందు భోగిమంటలు వేశారు. అంతేకాకుండా ప్రతి ఇంటిముందు రంగురంగుల రంగవల్లులతో తీర్చి దిద్దారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం, వేణుగోపాలస్వామి దేవాలయం, విశ్వనాథపురం రాములవారి దేవాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో స్వామివారిని ఉంచి కల్యాణం నిర్వహించారు.

కంభం : కంభం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని శ్రీగోదాదేవి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీరంగనాథస్వామి సమేత గోదాదేవి కళ్యాణానికి భక్తులు పట్టువస్త్రాలు, పూలు, పండ్లు అందజేశారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు భోగిపండ్లు పోసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కంభంలోని శ్రీ కోటా సత్యమాంబదేవికి విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలతో తమ మొక్కులు చెల్లించుకున్నారు.

ముగ్గుల పోటీలు

గిద్దలూరు : సంక్రాంతి వేడుకల్లో భాగంగా శ్రీకోటాసత్యమాంబదేవి గుడి ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం 3 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విజేతలకు ప్రత్యేక బహుమతులతోపాటు పాల్గొన్న వారందరికీ బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు.

తర్లుపాడు : మండలంలో భోగి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే లేచి ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేశారు. ఇళ్ల ఎదుట రంగవల్లులు వేసి సాంప్రదాయబద్ధంగా చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వచనం చేశారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం ఎదుట గ్రామస్తులు భోగి మంటలు వేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని సంక్రాంతి పండుగ సందర్భంగా మార్కాపురం పట్టణంలో సోమవారం భోగి పండుగను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు. అనంతరం ఆయా వీధులలో పెద్దఎత్తున దుంగలు, గడ్డి, ఇళ్లల్లోని పాత సామాన్లు వేసి భోగి మంటలు ఏర్పాటు చేశారు. భోగి మంటల వెలుగుల్లో నవచైతన్యంతో జీవితంలో ప్రేమ, శాంతి పొందాలని, పాతను వదిలి కొత్తదనాన్ని నింపుకోవాలని ఆశిస్తూ భోగి మంటలు వేశారు. భోగి మంటల చుట్టూ నృత్యాలు చేశారు. ఇళ్ల వద్ద బొమ్మలకొలువులు తీర్చిదిది చిన్నారులకు భోగిపండ్లు పోశారు.

మార్కాపురం వన్‌టౌన్ : ధనుర్మాసాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో చెన్నకేశవస్వామి మూల విరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తికి శ్రీరంగనాథుని అలంకారంలో గోదాదేవితో కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో భక్తబృందం ప్రత్యేక పూజలు, భక్తి గీతాలు నిర్వహించారు. గోదాదేవి కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

కొమరోలు : మండలంలోని అన్ని గ్రామాల్లో తెలుగువారి ముఖ్యపండుగ సంక్రాంతిని తొలిరోజు భోగి సందర్భంగా భక్తిశ్రద్ధలతో ఉల్లాసంగా నిర్వహించారు. భోగి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో, పట్టణాల్లో ఇంటిముందు రంగురంగు ముగ్గులతో అలంకరించారు. ఇంటి ముందు తెల్లవారుఝామునే భోగిమంటలను వేశారు. సుదూర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో యువత గ్రామాల్లోకి చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. మండలంలోని అన్ని దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఇడమకల్లు శ్రీ గుంటి లక్ష్మీనరశింహస్వామి దేవాలయంలో పూజారి కృష్ణామాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

పెద్ద దోర్నాల : భోగి పర్వదినం సందర్భంగా వేకువజామునే గ్రామాలో భోగి మంటలు వేశారు. ప్రధానంగా మహిళలు, యువతులు తమ లోగిళ్ల ముందు రంగు రంగుల రంగవల్లులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అనంతరం భోగి మంటలు వేసి ఉత్తరాయాణానికి స్వాగతం పలికారు. ఈ క్రమంలో కొన్ని గ్రామాల్లో హరిదాసులు వీధుల్లో కలియుగ దైవం శ్రీ శ్రీనివాసుని స్తుతిస్తూ కీర్తనలు పాడారు. తెలుగు సంప్రదాయాన్ని గుర్తు చేశారు. వేడుకల్లో భాగంగా స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు శాస్త్రోక్తంగా గోదాదేవి రంగనాయకునికి వివాహం జరిపించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొని భక్తి శ్రద్ధలతో వివాహ క్రతువును తిలకించి స్వామి వార్లను సేవించారు.





పొదిలి విశ్వనాథపురంలో గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు, దోర్నాలలో హరిదాసు అక్షయపాత్రలో బియ్యం పోస్తున్న చిన్నారులు, గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సంక్రాంతికి ప్రతి ఇంట నూతన శోభ

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు
- స్టేట్ బ్యాంకు వీధిలో ముగ్గుల పోటీలు

ఎర్రగొండపాలెం రూరల్ : సంక్రాంతి పండుగ అంటే ఆడపడుచులే గుర్తుకు వస్తారని పండుగ వేళ ఇంటిని అందంగా తీర్చి దిద్దడంతో పాటు ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేసి నూతన శోభ తీసుకొస్తారని టీడీపీ వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక స్టేట్‌బ్యాంక్ వీధిలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలసి ఆందరు పండుగను నిర్వహించుకోవాలని ఆకాక్షించారు. నియోజవర్గ ప్రజలకు సంక్రాంతి, భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి శ్రీలక్ష్మీ (ఎల్‌ఈడీ టీవీ), ద్వితీయ బహుమతి స్వాతి (కూలర్) తోటమహేష్ నాయుడు, తృతీయ బహుమతి లావణ్య (గ్రైండర్) పెరుమాళ్ల మల్లికార్జునరావులు స్పాన్సర్లగా వ్యవహరించారు. పోటీలలో పాల్గొన్న పది మంది మహిళలకు 10 కన్సోలేషన్ బహుమతులను గోళ్ల వెంకట సుబ్రహ్మణ్యం అందజేశారు. పోటీ లలో పాల్గొన్న ప్రతిమహిళకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య, టీడీపీ నాయకుడు నలగాటి మల్లికార్జున నాయుడు, మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, వేగినాటి శ్రీను, ఎంసీహెచ్ మంత్రునాయక్, కంచర్ల సత్యనారాయణగౌడ్, చీదెళ్ల నాగేశ్వ రరావుతో పాటు న్యాయనిర్ణేతలు, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు



భోగిమంట వేస్తున్న టీడీపీ కార్యకర్తలు

ఇంటింట భోగి మంటలు..

భోగిపండుగ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో భోగి మంటలు వేశారు. సోమవారం మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు ఆధ్వర్యంలో తెల్లవారుజామున ఈ భోగి మంటలు వేశారు. అలాగే వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నాయకులతో కలసి భోగి మంటలు వేశారు. మండలంలోని గ్రామాలలో చిన్నారులు, పెద్దలు కుటుంబ సభ్యులతో కలసి భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో కొత్తమాసు అనంత వెంకట సుబ్రహ్మణ్యం, కంచర్ల సత్యనారాయణ గౌడ్, ఎంసీహెచ్ మంత్రునాయక్, పెరుమాళ్ల మల్లికార్జున రావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యం



షెడ్డును ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

కొమరోలు, జనవరి13 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు నియోజవర్గంలోని రైతులు పాడిపంటలతో ఆర్థికంగా ఎదగాలనేదే ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ధ్యేయమని మాజీ ఎంపీటసీసీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని బాదినేనిపల్లి గ్రామంలో సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.2.30లక్షలతో నిర్మించిన పశువుల షెడ్డును ప్రారంభించారు. ఈసందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ మండలానికి రూ.3 కోట్లతో అభివృద్ధి నిధులు తీసుకొచ్చి వాటిని త్వరితగతిన పూర్తిచేయించిన ఘనత మన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిదే అన్నారు. రాబోవు రోజుల్లో గిద్దలూరు నియోజవర్గం అభివృద్ధికి అందులో సొంత మండల అభివృద్ధికి కృషిచేస్తారన్నారు. కార్యక్రమంలో కొమరోలు శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరీ దేవాలయం అధ్యక్షులు తుమ్మలపెంట వెంటకరమణ, నాయకులు బిజ్జాల తిరుమలరెడ్డి, నాయకులు ఎం. యల్లారెడ్డి, బోయిళ్ల భాస్కర్‌రెడ్డి, హుసేన్ బేగ్, రాజారెడ్డి, వెంటకరెడ్డి పాల్గొన్నారు.

స్వగ్రామంలో అశోక్‌రెడ్డి పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కొమరోలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి స్వగ్రామమైన హనుమంతురాయునిపల్లిలోని శ్రీ అభయ వీరాంజనేయస్వామి దేవాలయంలో సతీసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కులదైవమైన ఆంజనేయ స్వామి దేవాలయానికి ఉదయం చేరుకుని కుటుంబ సభ్యులతో కలసి పూజారి గౌరిపెద్ది హరిశర్మతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు సుఖశాంతులతో ఉండాలన్నారు. మంచి పాడిపంటలతో తులతూగాలని కోరుకున్నట్లు తెలిపారు. వీరి వెంట పార్టీ నాయకులు శ్రీనివాసచౌదరి, ముత్తుముల సంజీవరెడ్డి, షేక్ హసీనా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివముక్కోటి

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని నెహ్రూ బజార్‌లోని షిరిడీసాయి మందిరంలో వెలసిన శ్రీ చంద్రమౌళీశ్వర ఆలయంలో శివముక్కోటి కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు రవిశర్మ ప్రత్యేక పూజలు చేసి శివపార్వతులను విశేషంగా అలంకరించారు. ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనం కల్పించారు. సాయి మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు, అధ్యక్షులు సత్యనారాయణ, కోశాధికారి నాగరాజు, సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.



మార్కాపురం వన్‌టౌన్ : మార్గశిర బహుళ పాడ్యమి శివముక్కోటి పుర్కరించుకుని పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో మార్కండేశ్వరుడు జగదాంబ సమేతంగా సోమవారం ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. అర్చకులు వరుణ్ తేజ శర్మ, ఆంజనేయశర్మలు జగదాంబ మార్కండేశ్వర స్వాములకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చన, అలంకరణ నిర్వహించారు. అనంతరం అన్నాభిషేకం నిర్వహించి స్వామివారికి నాలుగు మాడవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి కార్యక్రమాలు పర్యవేక్షించారు.



విశేష అలంకరణలో మార్కండేశ్వరస్వామి

పెన్‌డ్రైవ్ సినిమా పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

మార్కాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ మూవీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న పెన్‌డ్రైవ్ సినిమా పోస్టర్‌ను సోమ వారం మార్కాపురం ఎమ్మె ల్యే కందుల నారాయణ రెడ్డి విడుదల చేశారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ సమాజంలో నేడు టెక్నాలజీని ఏ విధంగా దుర్వినియోగం చేస్తున్నారో తెలియజేస్తూ నిర్మిస్తున్న సందేశాత్మక చిత్రం పెన్‌డ్రైవ్ అన్నారు. చిత్రాన్ని అందరూ తప్పక ఆదరిస్తారన్నారు. మార్కాపురం ప్రాంతం నుంచి ఇటువంటి మంచి సినిమాను నిర్మిస్తున్న శ్రీకృష్ణ మూవీస్ నిర్మాతలు కటకం రామకృష్ణ, బొగ్గరపు బుజ్జి, దర్శకులు ఎం.రంగదీపక్‌లను అభినందించారు. కార్యక్రమంలో చిత్ర నిర్మాణానికి సహకారం అందించిన పలువురు పాల్గొన్నారు.

శ్మశానస్థలం కోసం కలిసికట్టుగా పోరాడాలి

మార్కాపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో క్రైస్తవుల కోసం అవసరమైన స్మశానస్థలం సాధించేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడాలని మార్కాపురం గ్రేస్ ఫాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు తంగిరాల ఇర్మియా అన్నారు. స్థానిక సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో సోమవారం మార్కాపురం గ్రేస్ ఫాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఫాస్టర్స్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇర్మియా మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శ్మశానస్థలం అవసరమన్నారు. కనిగిరికి చెందిన సమర్పణ కేర్ బైబిల్ కాలేజీ ప్రిన్సిపల్ రెవరెండ్ డాక్టర్ డి.పురుషోత్తం మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ అన్ని శుభాలు జరగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు కేశారపు నడిపికోటయ్య, కార్యదర్శి చెవుల పోలురాజు, సంయుక్త కార్యదర్శి జెన్నెపోగు జాన్, దారివేముల దేవయ్య, జెడ్డా పీటర్ పాల్గొన్నారు.

జేవీవీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నేతలు

మార్కాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. స్థానిక శ్రీవిద్య కోచింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో జేవీవీ నాయకులు రవికుమార్, యు. వెంకట్రావు, ఆర్.విప్లవ్‌కుమార్, జి.ముక్తేశ్వరరావు, పి.కోటిమోహన్, చక్కిలం శ్రీధర్, జి.ప్రతాప్‌నాయక్, డి.శంకర్, క్రైతా రాజేశ్వరిలు పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రి యజ్ఞం

గిద్దలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలో గాయత్రి యజ్ఞం వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున హాజరై సామూహికంగా జరిగిన గాయత్రి యజ్ఞంలో పాల్గొన్నారు. లోకకల్యాణార్థం ప్రతి పౌర్ణమికి, అమావాస్యకు గాయత్రి యజ్ఞం నిర్వహిస్తామని గాయత్రి పరివార్ సభ్యులు తెలిపారు.

క్రీడలతో స్నేహభావం

వీసీపల్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహబంధాన్ని పెంపొందిస్తాయని జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపాటి అరుణ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వీసీపల్లిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగవేళ నిర్వహిస్తున్న ఈ క్రీడలు యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. ఈ పోటీలలో 18జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బండారు రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, కనిగిరి, పామూరు మండలాల జనసేన అధ్యక్షులు రమేష్, ఏడుకొండలుతో పాటు నాని, నాయుడు, ఉన్నం వెంగళరావు, బద్దిపూడి ఎబినేజరు తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

పామూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలంకూరుకు చెందిన గంధం థామస్ గత ఏడాది జులై నెలలో పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. మృతునికి స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ప్రధానమంత్రి సురక్ష పథకం కింద బీమా కలిగి ఉన్నాడు ఈనేపథ్యంలో మృతునికి బీమా పథకం కింద రూ.2 లక్షలు మంజూరయ్యాయి. మృతుని భార్య విజయమ్మకు సోమవారం రూ.రెండు లక్షల చెక్కును మేనేజర్ టి.మరళీకృష్ణ అందజేశారు.

మాజీ ఎంపీటీసీ నారాయణరెడ్డి మృతి బాధాకరం


నారాయణరెడ్డి (ఫైల్)

పామూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనిమెర్లకు చెందిన మాజీ ఎంపీటీసీ సిద్దమూర్తి వెంకటనారాయణరెడ్డి (58) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. నారాయణరెడ్డి మరణావార్త సమాచారం తెలుసుకొన్న ఎమ్మెల్యే ఉగ్రనరశింహారెడ్డి, మాజీ మంత్రి ముక్కుకాశిరెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. నారాయణరెడ్డి మృతితో గ్రామంలో భోగి పండుగను ఎవరు జరుపుకోలేదు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, మాజీ ఎంపీపీ పోతు కొండారెడ్డి, సానికొమ్ము విజయభాస్కరరెడ్డి, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు భైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, సర్పంచ్‌లు ఎంసీఆర్ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణరెడ్డి, తుమ్మా ఆంజనేయరెడ్డి, ఉపసర్పంచ్‌లు వైవీ సాయి కిరణ్, గోళ్ల వెంకటేశ్వర్లు, కందుల శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు జి.హుసేన్‌రెడ్డి, కె.రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, జీవీ భాస్కరరెడ్డి, తదితరులు ఉన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.లక్షా 53వేలు

సీఎస్‌పురం(పామూరు), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.1,53,398లు వచ్చినట్లు ఈవో నరసింహాబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.40,240, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 30,180, శాశ్వత అన్నదానానికి రూ.82,978 వచ్చాయని తెలిపారు. అన్నదాన పథకానికి విరాళాలు వచ్చాయని తెలిపారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

ముండ్లమూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం ఉత్సాహంగా ఆటల పోటీలు నిర్వహించారు. ముండ్లమూరులో నా ఊరే నా ఇల్లు కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్ పోటీలు, బైక్ స్లో, చిన్నారులకు లెమన్ త్రో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పూరిమెట్లలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. మారెళ్లలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

తాళ్లూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మానవతా సంస్థ ఆధ్వర్యంలో గుంటిగంగ భవాని ప్రాంగణంలో సోమవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మానవతా స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో దాత నెలకుర్తి మల్యాద్రి చౌదరి వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పేద వృద్ధులు చలికాలంలో పడుతున్న బాధలను గుర్తించి తమవంతుగా చేయూతనిస్తూ దుప్పట్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ ధనిరెడ్డి వెంకటరెడ్డి, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ నెలకుర్తి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

తాళ్లూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దికూరపాడుగ్రామంలో సంక్రాంతి పండుగను పురష్కరించుకుని స్లోబైక్ పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు.పోలంరెడ్డి చినవీరారెడ్డి, ధర్మపత్ని లక్ష్మీనరసమ్మ జ్ఞాపకార్థం కుమారులు ఈ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పోలంరెడ్డి సూరారెడ్డి, రమణారెడ్డి, వీరనాగిరెడ్డి, కోటిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.అంజిరెడ్డి, ఉపాధ్యాయులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, ఎస్.యోగిరెడ్డి,ఎస్ఎంసీ చైర్మన్ వైవీ రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో భోగి కాంతులు

» ఊరూవాడా పండుగ సందడి

కనిగిరి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటా సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఇది మూడు రోజుల పాటు జరిగే అతి పెద్ద పండుగ. సోమవారం భోగితో ఆరంభమైన ఈ పండుగతో సందడి నెలకొంది. వేకువ జామునే ప్రతి ఇంట్లోని కుటుంబసభ్యులు భోగిమంటలు వేయటంతో ఎర్రటి కాంతులతో ప్రతి ఇల్లు శోభాయమానంగా మారింది. కనిగిరి పట్టణంలో భోగి పండుగ వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి, అందులో భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. యువతీ యువకులు భోగిమంటలు వేసేందుకు ఆసక్తి కనపరిచారు. దక్షిణాయానికి వీడ్కోలు పలికి ఉత్తరాయణ పుణ్యకాలాన్ని ఆహ్వానించటం భోగి పండుగతో ఆరంభమౌతుందని పురాణాలు తెలియజేస్తున్నాయి. భవిష్యత్తు తరాలు పురాణాల ఆచారాలను, సంప్రదాయాలను పాటించి కొనసాగించేలా ప్రజలు భోగి పండుగను ఘనంగా నిర్వహించారు.

దొనకొండలో..

దొనకొండ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నీ గ్రామాల్లో సోమవారం భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున పిల్లలు, పెద్దలు, మహిళలు వీధుల్లో, ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. సుదూర ప్రాంతాల్లో నివసించే ప్రజలు స్వగ్రామాలకు చేరుకోవటంతో గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది.

పామూరులో..

పామూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో జరుపుకొనే తొలి తెలుగు పండుగ అయిన మకర సంక్రాంతి వేడుకల్లో భాగంగా సోమవారం భోగి పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారుజామున ఇళ్లముందు భోగి మంటలు వేసి సందడి చేశారు. స్థానిక వాసవీ మాత దేవస్థానం భోగి మంటలు వేశారు. ఆర్యవైశ్య మహిళలు మంటల చుట్టూ తిరుగుతు నృత్యాలు చేశారు. స్థానిక మదనవేణు గోపాలస్వామి దేవస్థానం వద్ద ఈవో నరసింహాబాబు ఆధ్వర్యంలో భోగి మంటలను వెలిగించారు. ప్రతి కుటుంబంలో సంక్రాంతి వెలుగులు నిండాలని అమ్మవారి ని కోరుకున్నట్టు చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు తెలిపారు.


పీసీపల్లి: పెద్దన్నపల్లిలో ఎగిసి పడుతున్న భోగి మంటలు

పీసీపల్లిలో..


కనిగిరిలో భోగి మంటలు వేస్తున్న మహిళలు

పీసీపల్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భోగి పండుగను మండల ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజామున 4గంటల నుంచే గ్రామాల్లోని ఇళ్ల ముంగిట భోగిమంటలు వేశారు. ఇళ్లలోని పాత వస్తువులను మంటల్లో వేశారు.

మహిళలు ఇళ్లముంగిట రంగవల్లికలు వేశారు. చిన్నపిల్లలపై భోగి పండ్లు పోశారు. ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతరప్రాంతాల్లో ఉంటున్న వారంతా సొంత గ్రామాలకు చేరుకోవడంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేశారు. ముండ్లమూరు, పసుపుగల్లు, ఉల్లగల్లు, శంకరాపురం, పోలారం, మారెళ్ళ, ఈదర, నాయుడుపాలెం, సింగనపాలెంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. బంధువులతో ప్రతిఊరిలో పండుగ వాతావరణం కన్పించింది.

తాళ్లూరులో..

తాళ్లూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సంక్రాంతి సందడి నెలకొంది. సోమవారం ఇళ్ల ముందు భోగి మంటలు వేసి సందడి చేశారు. మహిళలు, ఇళ్ల ముందు రంగవల్లులు వేసి సంక్రాతికి స్వాగతం పలికారు. సాయంత్రం వేల చిన్నారులకు భోగి పండ్లు పోసి సంబరాలు జరిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు చే శారు. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వివిధ పోటీలు నిర్వహించారు. పండుగలకు ఇతరప్రాంతాల్లో ఉన్న కుటుంబీకులు రావటంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి.

వైసీపీ హయాంలో 'సంక్షేమం' శూన్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


ఎస్‌సీ-2 హాస్టల్‌లో మెరుగైన వసతుల కల్పనకు ఎస్ఎస్ఏ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అభివృద్ధి, సౌకర్యాలు శూన్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక ఎస్‌సీ -2 హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవర్గాలకు చెందిన కుటుంబాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం గాలి కొదిలేసిందన్నారు. కనీస వసతులు కూడా లేక పోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్ల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు.

కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పనకు విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నట్లు డాక్టర్ ఉగ్ర చెప్పారు. హాస్టల్‌లో వసతుల కల్పనకు అవసరమైన పనులు చేపట్టేందుకు తగిన కార్యాచరణపై సర్వశిక్షా అభియాన్ అధికారులతో మాట్లాడారు. ఈమేరకు తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో ఉండి చదువుకోవటం ఓ అనుభూతిలా విద్యార్థులకు కల్పించాలన్నారు. ఉన్నతస్థాయికి ఎదిగి భవిష్యత్తులో వారు అండగా నిలిచేలా హాస్టళ్ల పనితీరు మెరుగు పరచాలన్నారు. విద్యార్థులకు ప్రధానంగా చదువుతో పాటు టాయిలెట్స్, భోజన, విశ్రాంతి వసతులు సక్రమంగా ఉండేందుకు చేపట్టాల్సిన పనులపై అంచనాలు తయారుచేయాలని అధికారులకు సూచించారు. నాణ్యమైన భోజనం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం పట్టణంలోని కేఆర్‌సీ స్పోర్ట్స్ బాక్స్ క్రికెట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. బ్యాటింగ్ చేసి ఉత్సాహపరిచారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, సిద్ధాంతి బారాయిమాం, కృష్ణారెడ్డి, మనోజ్, విజయభాస్కర్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సంప్రదాయాలను పరిరక్షించాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తెలుగు సంప్రదాయాలను భావితరాలకు అందించేవిధంగా కార్యక్రమాలు నిర్వహించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ముగ్గుల పోటీలు, లెమన్‌స్పూన్ పోటీలు, కుర్చీలాట, పురుషులకు తాడులాగుడు పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని దర్శిలో వైభవంగా జరుపుకోవటం ఆనందంగా ఉందన్నారు. తెలుగు సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ముగ్గుల పోటీల్లో 200 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

విజేతలు వీరే..

దర్శి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు, లైమన్‌స్పూన్ పోటీలు, మ్యూజికల్ చైర్, తాడులాగు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన చందనకు శ్యామ్‌సంగ్ ఫ్రిజ్ ప్రదానం చేశారు. మిగతా స్థానాల్లో వచ్చిన ప్రత్యూష, పావని జానకికి ఎల్ఈడీ టీవీలు పి.మనోజ్ఞపి అనూషలకు గ్రైయిండర్లు అందజేశారు. మ్యూజికల్ చైర్స్ పోటీల్లో డి.శ్రీలక్ష్మి, దుర్గాభవాని, మనీష, తాడులాగుడు పోటీల్లో అంజలి టీమ్, భాగ్యలక్ష్మి టీమ్ వరుస స్థానాల్లో నిలిచారు. లేమన్ అండ్‌స్పూన్ పోటీల్లో సీనియర్స్ విభాగంలో భాగ్యలక్ష్మి, సీహెచ్ పల్లవి, జూనియర్స్ విభాగంలో ఆరాధ్య, లిఖితకు ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారు. వీరందరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, సీఐ వై.రామారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కె.చంద్రశేఖర్, యాదగిరి వాసు, పుల్లలచెరువు చిన్నా, దేవతి మహానంద తదితరులు పాల్గొన్నారు.


దర్శి జూనియర్ కళాశాల ఆవరణలో ముగ్గులు వేస్తున్న మహిళలు



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, డీఎస్పీ లక్ష్మీనారాయణ తదితరులు


దేవతామూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా రంగనాథస్వామి కల్యాణం

దొనకొండ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి నేతృత్వంలో శ్రీగోదాదేవి శ్రీరంగనాథస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8గంటల నుంచి పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చనలు, దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీగోదాదేవి, రంగనాథస్వామిలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. పెద్దన్నపాలెం గ్రామానికి చెందిన ఉభయదాతలు చెన్నబోయిన పాపయ్య, సుజాతలక్ష్మి, దందూరి చిన్నగురవయ్య, కోటేశ్వరమ్మ దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం

దొనకొండ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను ఆపార్టీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను గుర్తించేం దుకు కబడ్డీ పోటీలను నిర్వహించటం శుభపరిణామమన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోడి వెంకటేశ్వర్లు, కొత్తం రఘునాదరెడ్డి, వడ్లమూడి వెంకటాద్రి, కుందుర్తి లక్ష్మణ్, మోడి ఆంజనేయులు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, విప్పర్ల లక్ష్మీరావు, పెమ్మసాని లక్ష్మీనారాయణ, యరగొర్ల బసవయ్య, కాళ్ల హనుమంతరావు, బీపీ సైరస్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


ఫ్లాగ్‌లను అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మన టీడీపీ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలను సోషల్‌మీడియాలో ప్రచారం చేసిన వారిని అభినందిస్తూ వారికి పార్టీ కార్యాలయం నుంచి పంపిన ఫ్లాగ్‌లను సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ సోషల్ మీడియాలో ప్రచారం చేసిన 48మందికి కేంద్ర కార్యాలయం నుంచి వారిని గుర్తించి స్టాండ్ ఫ్లాగ్‌లను అందించి ప్రోత్సహించటం జరుగుతుందన్నారు. పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్ళి వాటికి విశేష ఆదరణ లభించేలా కృషి చేసిన ప్రతి కార్యకర్తకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అదేస్ఫూర్తితో ప్రతిఒక్కరూ కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాసంక్షేమ కార్య క్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఇంట్లో టీడీపీ భాగమయ్యేలా కృషి చేయాలన్నారు. వారికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఐటీడీపీ రాష్ట్ర నాయకులు షేక్ జంషీర్ అహ్మద్, మార్నెని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువచేయాలి

వీసీపల్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నా రు. మండలంలోని ఐటీడీపీ కార్యకర్తలు సోమవారం కనిగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. టీడీపీ యాప్, సోషల్ మీడియాలో పార్టీ కార్యక్రమాలను ప్రచారం చేసినందుకుగాను పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పంపించిన తెలుగుదేశం పార్టీ టేబుల్ ఫ్లాగ్స్‌ను ఐటీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం సోషల్‌మీడియాలో మీరుచేసిన ప్రచారాన్ని అధిష్ఠానం గుర్తించిందన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతిఒక్కరికీ గుర్తింపు లభిస్తుం దని చెప్పారు. ఈ సందర్భంగా ఐటీడీపీ మండల కోఆర్డినేటర్‌లు పాలూరి మహేంద్ర, హజారుద్దీన్, కసిరెడ్డి హనుమారెడ్డి, ముప్పూరి వసంతకు మార్, పూండ్ల పోలయ్యను ఎమ్మెల్యే అభినందించారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

నాగులుప్పలపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొనడంతో గాయపడ్డాడు. ఈ సంఘటన ఉప్పుగుండూరు గ్రామంలోని 216 రహదారిపై సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలమేరకు ఒమ్మెవరం గ్రామానికి చెందిన నార్నె సురేష్ సోమవారం చవటపాలెంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లేందుకు తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఉప్పుగుండూరు గ్రామంలోని మాచవరం రోడ్డు జంక్షన్‌వద్ద 216 జాతీయ రహదారి దాటుతుండగా చీరాల వైపు వెళుతున్న లారీ ఢీకొంది. దాంతో బైక్‌పై నుంచి కిందపడి సురేష్ గాయపడ్డాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం 108లో ఒంగోలు తరలించారు.

మద్యం విక్రయిస్తూ.. తిమ్మసముద్రం గ్రామంలోని మర్రిచెట్టు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్ఐ బి.శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. 44 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నారు.

రీసర్వేతో కొత్త కష్టాలు

» తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు
» గ్రామసభల్లో 307 దరఖాస్తులు
» ఒక్కటీ పరిష్కరించలేకపోతున్న అధికారులు
» గత వైసీపీ ప్రభుత్వం వల్లే సమస్యలు

తాళ్లూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎల్‌పీఎం(ల్యాండ్ పార్సిల్ మేనేజ్‌మెంట్) విధానాలతో భూములు, స్థలాల అమ్మకాల కొనుగోలుకు ఇబ్బందులు తప్పటం లేదు. శాశ్వత భూహక్కు కల్పిస్తామని ఎంతో ఆర్భాటంగా చేపట్టిన భూరీసర్వే రైతులపాలిట గుదిబండలా మారింది. ఈసమస్యల పరిష్కారానికి రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

మండలంలోని మల్కాపురం, శివరాంపురం, దోసకాలపాడు, మాధవరం, శంకరనారాయణ పురం, సార్వమిట్టగ్రామాల్లో గత ఏడాది రీసర్వే నిర్వహించారు. ఈసర్వే జరిగిన ప్రతిగ్రామంలో రికార్డులు తప్పులు తడకగా నమోదు చేశారని రైతులు వాపోతున్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రైతులను సంప్రదించకుండా డ్రోన్ కెమెరా ఆధారంతో రీసర్వే చేయడంతో భూముల హద్దులు తారుమారయ్యాయి. రీసర్వే జరిగిన గ్రామాల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని రైతాంగం అనేకమార్లు తహసీల్దార్ కార్యాలయం చూట్టు ప్రదక్షిణలు చేసినా ఎలా పరిష్కరించాలో తెలియటం లేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం రీసర్వే జరిగిన గ్రామాల్లో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో 307 దరఖాస్తులు వచ్చినా ఒక్క దరఖాస్తు పరిష్కారం కాలేదు. శివరాంపురం గ్రామంలో అత్యధికంగా తప్పుల రికార్డుల వల్ల ఇబ్బందులు పడుతున్నామని 119 దరఖాస్తులు రెవెన్యూ అధికారులకు అందజేశారు. అధికారుల తప్పిదాల వల్ల రుణాలు రీషెడ్యూల్ చేయటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములు అమ్మకాలు, కొనుగోలు జరగక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. మాధవరం రీసర్వే గ్రామసభలో 65 దరఖాస్తులు అందజేసినా పరిష్కారం కాలేదు.

ఎల్‌పీఎం ఖాతా నంబర్లతో గందరగోళం

రీసర్వేకు ముందు ఖాతా, సర్వే నంబర్ల ద్వారా రికార్డులను నమోదు చేసేవారు. రీసర్వే అనంతరం ఖాతా, ఎల్‌పీఎం నంబర్లు మాత్రమే కేటాయించారు. దీంతో భూసమస్యల్లో కొత్త సమస్య ఉత్పన్నమయింది. ఒక కుటుంబంలో ఒకరు అంతకన్నా ఎక్కువమంది పేరున భూమి ఉంటే, వారికి సంబంధించిన యాజమాన్య రికార్డుల ప్రకారం ఒక్కొక్కరికి ఖాతా, ఒక ఎల్‌పీఎం కేటాయించాల్సి ఉంది. అలాకాకుండా అందరికి కలిపి ఒకే ఎల్‌పీఎం కేటాయించారు. దీంతో రైతుల భూముల రికార్డులు, హద్దులు గందరగోళంగా మారాయి. వేరొక పేరు మీద భూయాజమాన్య హక్కుమార్పాలంటే ఖచ్చితంగా ప్రతి ఒక్కరికి ఒక ఎల్‌పీఎం ఉండాలి. కొంత మంది భూములు కొన్న రైతులు రిజిస్ట్రేషన్ దస్తావేజుల ప్రకారం పట్టాదారు పాసుపుస్తకం పొందినా ప్రస్తుతం రీసర్వే జరిగిన గ్రామాల్లో ఆన్‌లైన్‌లో గతంలో అమ్మినవారి పేర్లు కన్పిస్తున్నాయి. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఈసమస్యను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు ఎంత ప్రయత్నిస్తున్నా రీసర్వే గ్రామాల్లో ఆన్‌లైన్‌లో భూముల వివరాలు కన్పించటం లేదు. ఈక్రమంలో భూముల పేర్లమార్పులు, చేర్పులకు అవకాశం కుదరటం లేదు. రైతాంగం అధికారుల చుట్టూ తిరుగుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులకు కూడా స్పష్టత లేక పోవటంతో ఒక్క రెవెన్యూ సమస్య పరిష్కారం కాలేదు.



తహసీల్దార్ కార్యాలయం

కొత్తచిక్కులు వచ్చాయి

- రావులపల్లి నన్నయ్య, మాధవరం



చాలా కాలంగా మా భూరికార్డులు ఆన్‌లైన్‌లో ఉన్నాయి. సర్వే నంబర్ 87/1లో 0.069 సెంట్ల భూమి వుంది. గతే ఏడాది జరిగిన రీసర్వేలో విలేజ్ సర్వేయర్ చేసిన తప్పిదంతో తన భూమి నా పేరు మీద ఆన్‌లైన్‌లో కన్పించక పోవటంతోపాటు, రికార్డులు కూడా తారుమారయ్యాయి. రీసర్వే తరువాత భూమి నాపేరునలేదు. అధికారులను చేసిన తప్పిదాలను పరిష్కరించాలని అనేక మార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితంలేదు. కుమార్తెకు వివాహం చేయాలని నిర్ణయించినా చేతిలోచిల్లి గవ్వ లేదు. పొలం అమ్ముదామనుకున్నా రీసర్వేతో నాపేరున లేదు. రెవెన్యూ అధికారులు రీసర్వేతో జరిగిన తప్పిదాలను పరిష్కరించాలి.

పాత రెవెన్యూ రికార్డులే నయం

- వద్దినేని శ్రీనివాసరావు, శివరాంపురం



రైతులను సంప్రదించకుండా ఇష్టానుసారం రీసర్వే చేయటంతో తప్పులు దొర్లాయి. తనకు సంక్రమించిన భూముల్లో 172లో 90 సెంట్ల భూమిలో 0.056 సెంట్ల భూమి మాత్రమే రికార్డుల్లో ఉంది. 171/1లో 1.70సెంట్లు, 164/12లో 54 సెంట్లు, 141/3లో 1.18 సెంట్లు కలిసి 3 ఎకరాల 42 సెంట్లు భూమి రికార్డుల్లో కన్పించకుండా పోయింది. ఆ భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ఎల్‌పీఎం నంబర్ ఏమిటో అర్థంకావటం లేదు. గతంలో ఉన్న రెవెన్యూ రికార్డులే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉండేది. సమస్యలు వస్తే అధికారులు సులభంగా పరిష్కరించేవారు. ప్రస్తుతం అధికారులు కూడా ఏమి చేయలేక పోతున్నారు. రీసర్వే ప్రక్రియను పూర్తిగా రద్దు చేసి పాత రెవెన్యూ రికార్డులను కొనసాగించాలి.



సరదాల సంక్రాంతి!

భానుడి ఉత్తరాయాణంతో వెలుగులు పండే సుదినం
పంట చేతికొచ్చిన వేళ రైతులు చేసుకునే సంబరాలు
జిల్లా వ్యాప్తంగా ఘనంగా భోగి వేడుకలు


భోగిమంటలు వేసి వేడుకలు జరుపుకుంటున్న చెరుకుపల్లి మండలం గూడవల్లి-నడింపల్లి గ్రామాల ప్రజలు

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రులకు అత్యంత ప్రీతిపాత్రమైన పండుగ మకర సంక్రాంతి. తెలుగునాట ప్రతి ఇంటా ఆ సంక్రాంతి తెచ్చే సంతోషం అంతా ఇంతా కాదు. దేశంలో ఎక్కడున్నా.. ఆ సుదినాన అందరూ సొంత గ్రామాలకు ప్రయాణం కట్టేస్తారు. అవకాశం ఉండాలే కాని విదేశాల్లో ఉన్నవారు సైతం సొంత ఊరి బాట పడతారు. ముచ్చటగా మూడు రోజులు, అదృష్టం కలిసి వస్తే నాలుగు రోజులు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి సంబరాలు చేసుకుని సంతోషాలను ప్రోది చేసుకుంటారు. ఆ మధురానుభూతులతో తిరుగు ప్రయాణం కడతారు.

ధనుర్మాసంలో సూర్య భగవానుడు దక్షిణాయాణం ఉచ్ఛదశను చేరుతాడు. భోగి పండుగ రోజున దక్షిణాయాణాన్ని పూర్తి చేసుకుని ఉత్తరాయణాన్ని ప్రారంభిస్తాడు. ఆ సమయంలో ప్రతి ఒక్కరూ తమ సామర్థ్యం మేరకు దానధర్మాలు చేస్తే మంచిదని ప్రతీతి. అలా చేయడం వల్ల శుభ ఫలితాలొస్తాయని జనం నమ్ముతుంటారు. కొత్తగా పెళ్లి చేసుకున్న వారు బొమ్మల నోము, సావిత్రి గౌరీ వ్రతం చేస్తారు. మరికొందరు మకర సంక్రాంతి రోజున తమ పూర్వీకుల ఆత్మ శాంతి కోసం తమ సామర్థ్యం మేరకు దానధర్మాలు చేస్తారు.

పురాణాల ప్రకారం 'సంక్రాంతి'

పురాణాల ప్రకారం.. మకర సంక్రాంతి రోజునే భగిరథుడు తన తపస్సుతో ఆకాశంలో ఉండే గంగమ్మను భువిపైకి తీసుకొస్తాడు. తమ పూర్వీకులకు తర్పణం సమర్పించేందుకు భగిరథ మహర్షి గంగమ్మను భువిపైకి ఆహ్వానిస్తాడు. తన ప్రతిపాదనను అంగీకరించి మకర సంక్రాంతి పండుగ రోజున గంగాదేవి భువిపైకి వస్తుంది. గంగాదేవి భూమి పైకి వచ్చిన సుదినమైన రోజు కావడంతో ఆ రోజున మకర సంక్రాంతి పండుగ చేసుకుంటారు. కాబట్టి ఆ పవిత్రమైన రోజున గంగానదిలో లేదా ప్రవహించే నీటిలో స్నానం చేస్తే పుణ్యఫలాలు పొందుతారని పురాణాలు చెబుతున్నాయి. సంక్రాంతి నెలలో హరిదాసుల సందడి చాలా ప్రత్యేకమైనది. హరినామ సంకీర్తనలు పాడుతూ ప్రజలను అలరిస్తూ ఇంటింటికీ తిరిగి మాలదాసరులు సందడి చేస్తారు. పంట చేతికందిన సంతోషంతో రైతులు వారికి తగిన రీతిలో ధాన్యం ఇచ్చి గౌరవించేవారు. సామాన్యులు తమకు తోచిన మొత్తం ఇచ్చేవారు.


బాపట్ల : భావన్నారాయణస్వామి దేవాలయం దగ్గర గంగిరెద్దుల విన్యాసం

మూడో రోజు ముక్కపండగ 'కనుమ'!

మకర సంక్రాంతి పండుగ ముగిసిన మరుసటి రోజున కనుమ పండుగ. ఈరోజున తమ పశువులను అందంగా అలంకరించి, వాటికి ఇష్టమైన దాణా పెడతారు. కనుమ నాడు మాంసాహారం తీసుకుంటారు. కనుమకు ముక్కనుమ కూడా తోడైతే ఆ సంతోషాలకు హద్దులే ఉండవు. అలా నాలుగైదు రోజులపాటు సంక్రాంతి పండుగ సందడి చేస్తుంది. ఏడాదికి సరిపడా సంతోషాన్ని పంచుతుంది. తనివి తీరా ఆస్వాదించి పండగను ముగించుకుని అందరూ మళ్లీ పట్నం బాట పడతారు. సంవత్సరానికి సరిపడేంత సంతోషాన్ని తీసుకెళ్తారు. అందుకే సంక్రాంతిని సరదాల సంక్రాంతిగా చెప్పుకుంటుంటారు.

నువ్వా నేనా

1 ఆకట్టుకున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు


జాతీయస్థాయి పోటీలో తలపడుతున్న ఎడ్ల జత

పర్చూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : అట్టహాసంగా పర్చూరు మం డలం, అన్నంబొట్ల వారి పాలెం గ్రామంలోని గొట్టిపాటి హనుమంతు రావు మెమోరియల్ ప్రాంగణంలో జాతీయస్థాయి ఒంగో లు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు సోమవారం నువ్వానేనా అన్నట్లు ప్రారంభమయ్యాయి. తొలిరోజు నిర్వహించిన సీనియర్ విభాగంలో 22 కింటాళ్ల బండను 20 నిమిషాల్లో లాగేలా జరిగిన (జాక్‌పాట్)కు 8 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈపోటీల్లో గెలుపొందిన ఎడ్ల జతకు మొదటి బహుమతిగా రూ.1,50,116, రెండవ బహుమతి రూ.1,00,116, మూవడ బహుమతి రూ.60,116, నాల్గవ బహుమతి రూ.36,116, ఐదవ బహుమతిగా రూ.20,116 చొప్పున అందజేస్తా మని నిర్వాహకులు గోరంట్ల భాస్కరావు తెలిపారు. జాక్‌పాట్ విభాగంగా నిర్వహించిన పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావటంతో ప్రాంగణం కిక్కిరిసింది. ఫ్లడ్‌లైట్‌ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి.

జాక్‌పాట్ కొట్టిన గుంటూరు జిల్లా ఎడ్లు

జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో గుంటూరు జిల్లా ఎడ్లు సత్తా చాటాయి. సోమవారం నిర్వహించిన సీనియర్ విభాగం (జాక్‌పాట్)లో గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామానికి చెందిన జనిరెడ్డి ఎడ్ల జత 4226.4 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. రెండవ బహుమతిని పల్నాడు జిల్లా ఇనిమెట్ల గ్రామానికి చెందిన కె.లక్ష్మారెడ్డి ఎడ్లు 3900 అడుగుల దూరం లాగి సాధించాయి. బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన ఆర్‌కే బుల్స్ 3776 అడుగులతో మూడో స్థానం, నంద్యాల జిల్లాకు చెందిన రామ్‌గోపాల రెడ్డి ఎడ్లు 3756 అడుగుల దూరం లాగి నాల్గవ స్థానం కైవసం చేసుకున్నాయి. అదేవిధంగా ప్రకాశం జిల్లా, టంగుటూరుకు చెందిన ఎం.కృష్ణమోహన్ ఎడ్లు 3486 అడుగుల దూరం లాగి ఐదవ స్థానం పొందాయి.

తీరంలో.. పందేల జోరు


కొల్లూరు మండలం అనంతవరం బరిలో జరుగుతున్న కోడి పందెం

- రూ.లక్షల్లో బెట్టింగ్‌లు
- యథేచ్ఛగా కోతముక్క పేకాట, రమ్మీ నెంబర్ల జూదం
- భారీ బరుల ఏర్పాటు
- ఇతర రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన పందెం రాయుళ్లు
- జోరుగా మద్యం అమ్మకాలు
- వీవీపీలకు నాటుకోడి, మటన్ బిర్యానీ
- పందేలను వీక్షించిన మంత్రి అనగాని, జనసేన నాయకులు


కొల్లూరు : పందెం బరి వద్ద జోరుగా సాగుతున్న జూద క్రీడ


చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో పందెం వేసేందుకు కోడి పుంజులతో సిద్ధంగా ఉన్న పందెంరాయుళ్ళు


తూర్పుపాలెంలో నెంబర్లాట ఆడుతున్న పందెంరాయుళ్ళు

తెనాలి, జనవరి 13(ఆంధ్రజ్యోతి):పందెంకోళ్ళ పౌరుషంతో కత్తులు దూస్తే పేకముక్క జూదప్రియుల చేతుల్లో గుండాట ఆడిందికోతముక్క లక్షల నోట్లకట్టల కట్లుతెంపింది. తమ జాతకాన్ని పరిక్షించుకునేందుకు ఎంతోమంది అదృష్టాన్ని నెంబర్లాట తారుమారుచేసింది. మద్యం ఏరులైపారింది. సంప్రదాయం మాటున నిషేధాజ్ఞలను కూడా లెక్కచెయ్యకుండా పందెంరాయుళ్ళు విచ్చలవిడిగా పందాలు వేశారు. డెల్టాప్రాంతంలో వారంముందునుంచే కోడిపందేలు కోతముక్క జోరందుకుంటే అనధికార అనుమతులతో సోమవారం నుంచి బహిరంగంగానే కోడిపందేలను కొనసాగించారు. భోగి రోజున భారీస్థాయిలో పందేలు కాయటం, నోట్లను విరజిమ్మటం చూస్తే వాటిని నియంత్రించాల్సిన అధికారులకు ప్రేక్షకపాత్రగానే మిగిలిపోయింది. గుంటూరు,బాపట్ల,పల్నాడుజిల్లాలో కొన్నిచోట్ల మాత్రమే అధికారపార్టీ నేతల కన్నుసన్నుల్లోనే బరులు సిద్ధమై కోడిపందేలను వేశారు.

తీరప్రాంతంలో జోరుగా కోడిపందేలు

తీరంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సంప్రదాయాలను అడ్డంపెట్టుకుని అధికారపార్టీ నాయకుల ఆధ్వర్యంలో కోడిపందేలు జోరుగా కొనసాగాయి. పందెం రాయుళ్ళు నాలుగు జిల్లాలతోపాటు తెలంగాణా రాష్ట్రం నుంచి వేలాదిగా తరలి రావటంతో భోగిరోజు మొదటిరోజున లక్షలాది రూపాయలు పందేలు జోరుగా సాగాయి. ఈపందేలను రెవెన్యూశాఖ మంత్రి అనగానిసత్యప్రసాద్, జనసేనపార్టీ జిల్లానాయకులు స్థానిక టీడీపీ నాయకులు పలువురు ప్రముఖులు వీక్షించారు. రేపల్లె నియోజకవర్గంలో చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో, వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం పల్లెకూనలో భారీగా కోడిపందేలు జరిగాయి. దృష్టి సారించాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తైనా చూసిన దాఖలాలు లేవు. అధికారులపై రాజకీయ నాయకులు తీవ్ర ఒత్తిడి తేవటంతో చేసేదిలేక అధికారులు కూడా చేతులెత్తేశారు. దీంతో పందెం రాయుళ్ళు జోరుగా హద్దుఅదుపులేకుండా పందేలను నిర్వహించారు. ఈరెండుచోట్ల అధికార పార్టీ ప్రధాన నాయకుని ఆధ్వర్యంలో పదిహేను బరులను ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. బరుల సమీపంలోనే హైటెక్ క్లబ్‌ల తరహాగా పేకాట కోసం ప్రత్యేక గుడారాలు వేసి పేకాట, కోతముక్క ఆటలు జోరుగా కొనసాగించారు. లక్షలాది రూపాయలతో వేలాది మంది పందెం రాయుళ్ళు పాల్గొని పందేలను వేశారు. తూర్పుపాలెంలో రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు, రూ.లక్ష వరకు ప్రత్యేక బరులను ఏర్పాటు చేసి నిర్వాహకులు పందేలు నిర్వహించారు. వీఐపీ బరుల్లో లక్ష నుంచి రూ.3లక్షల వరకు కోడిపందేలు నిర్వహించారు. గుండాట, నెంబర్లాట విచ్చలవిడిగా కొనసాగించారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి, తెలంగాణా రాష్ట్రం నుంచి వేలాదిగా పందెం రాయుళ్ళు తరలివచ్చారు. పల్లెకూనలో ఆరు బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు జోరుగా కొనసాగించారు. బరుల సమీపంలో ఒక్కో బరిలో రెండు స్టాల్స్ ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు భారీగా జరిపారు. విద్యుత్ శాఖాధికారులు నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, విద్యుత్ లైన్లు లాగి భారీ సంఖ్యల్లో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు.


తూర్పుపాలెంలో వీఐపీ బరి సమీపంలో కోడిపందాలకు సిద్ధం చేసిన కోడిపుంజులు

పోలీసుల కట్టడి ఫలించేనా

అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ మండలం లో ఇప్పటికే పందెం రాయుళ్ల ఒక అడుగు ముందుకేసి ఇప్పటికే గత రెండు రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా కోడి పందాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన చోట్ల కూడా వచ్చే రెండు, మూడు రోజులలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. గతంలో అద్దంకి మండలం ధర్మవరం, శంఖవరప్పాడు, కలవకూరు, బొమ్మనంపాడు, కొత్తరెడ్డిపాలెం, గోవాడ, రామాయపాలెం, ధేనువకొండ, కుంకుపాడు, బల్లికురవ మండలం కొత్తూరు సంతమాగులూరు మండలం మిన్నెకల్లు, పంగులూరు మండలం రామకూరు, కొరిశపాడు మండలం పమిడిపాడు, తమ్మవరం, యర్రపాలెం తదితర ప్రాంతాలలో కోడిపందాలు జరిగాయి. ప్రధానంగా రెండు,మూడు మండలాల సరిహద్దులో జనసంచారానికి దూరంగా ఉన్న ప్రాంతాలలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తుంటారు. అదే సమయంలో పందెం వేసే ప్రాంతాలకు నలుదిక్కులా రోడ్లుకు దూరంగా ఎవరెవరు వస్తున్నదీ గమనించేందుకు కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసి కాపలా ఉంటారు. ఈ క్రమంలో కొత్త వ్యక్తులు, పోలీసులు వస్తున్నట్లు అనుమానం వస్తే కాపలా ఉన్న వ్యక్తులు పందెం రాయుళ్లకు సమాచారం అందిస్తారు. దీంతో అక్కడ నుంచి మకాం మార్చేస్తారు. కోడి పందేలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇప్పటికే కోడి పందేలు జరిగే అవకాశం ఉన్న గ్రామాలలో పోలీసులు పర్యటించి హెచ్చరికలు కూడా చేసినట్లు తెలుస్తుంది. దీంతో ఈ ఏడాది కోడి పందేలను కట్టడి చేస్తారా లేక నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తారా చూడాలి.


బల్లికురవ మండలం మల్లాయపాలెం వద్ద తలపడుతున్న కోళ్లు

నేడు రూ. 2 లక్షల పందేలు

కొల్లూరు మండల పరిధిలోని అనంతవరం, క్రాప అడ్డ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పందెం బరుల వద్దకు పందెంరాయుళ్ల వందల సంఖ్యలో తమ మేలుజాతి కోడి పుంజులతో పందేలు వేసేందుకు తరలి వచ్చారు. పెద్ద మొత్తంలో కోడి పందేలు వేయడంతో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. రూ.20 వేలు నుంచి రూ.లక్ష వరకు పందేలు జోరుగా సాగాయి. నిర్వాహకులు పందెం రాయుళ్ల కోసం బరుల వద్ద అన్ని ఏర్పాట్లు కల్పించారు. మరోవైపు కోతముక్క, గుండాట, నెంబర్లు ఆట, రాత్రింబవళ్లు పేకాట స్థావరాలను కూడా ఏర్పాటు చేశారు. టీ నుంచి బిర్యానీ వరకు బరి వద్దే పందెం రాయుళ్ల కోసం స్టాల్స్ వెలిశాయి. ద్విచక్ర వాహనానికి రూ.50, కార్లకు రూ.100 పార్కింగ్ రుసుంగా వసూలు చేస్తున్నారు. పందేలు తిలకించేందుకు మహిళలు, యువతులు కూడా ఆసక్తి చూపడంతో సందడి వాతావరణం నెలకొంది.

సంక్రాంతి పర్వదినాన ఒక్కో పందెం రూ.2 లక్షలు

మంగళవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని క్రాప అడ్డరోడ్డు వద్ద నిర్వాహకులు ఒక్కో పందెం రూ2 లక్షలు చొప్పున 9 పందాలు నిర్వహిస్తున్నట్లు మైకుల్లో ప్రచారం చేశారు. ఎక్కువ పందేలు గెలుపొందిన కోడి యజమానికి ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా ప్రకటించారు.


తూర్పుపాలెంలో బరులవద్దే యథేచ్ఛగా మద్యం సేవిస్తున్న మందుబాబులు


తూర్పుపాలెంలో పార్కింగ్‌లో భారీగా నిలిచిన ద్విచక్రవాహనాలు,కార్లు



అద్దంకి ఆణిముత్యాలు బండారు బ్రదర్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఫణీంద్రబాబు, తహసీల్దార్ ప్రభాకరరావు, దేవపాలన

అద్దంకికి గర్వకారణం బండారు బ్రదర్స్ పౌరాణిక నాటక ప్రదర్శనలు

అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పౌరాణిక నాటక ప్రదర్శనలతో ఒకరు, ఉపాధ్యాయునిగా మరొకరు బండారు రామారావు, వెంకటేశ్వర్లు ప్రత్యేక గుర్తింపును తీసుకు వచ్చి అద్దంకికి గర్వకారణంగా నిలిచారని టీడీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఫణీంద్రబాబు అన్నారు. రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ ఉబ్బా దేవపాలన, పురావస్తు పరిశోధకులు, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు జ్యోతిచంద్రమౌళి రంగస్థల నటుడు బండారు రామారావు, ఉపాధ్యాయుడు బండారు వెంకటేశ్వర్లు రచించిన అద్దంకి ఆణిముత్యాలు బండారు బ్రదర్స్ పుస్తకాన్ని సోమవారం స్థానిక నంబూరివారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. అద్దంకి ఆణిముత్యాలు బండారు బ్రదర్స్ పుస్తకాన్ని ఆదివారం అద్దంకి వచ్చిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందజేశారు. బండారు వెంకటేశ్వర్లు మనుమడు బండారు అశ్వనీకుమార్ ప్రపంచ శా స్త్రవేత్తలలో భారతదేశం తరపున 2వ స్థానంలో నిలవడం అద్దంకికి గర్వకారణం అని పలువురు వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో చిన గంజాం తహసీల్దార్ ప్రభాకరరావు, రిటైర్డ్ డీఎస్పీ బీరం నాగేశ్వరరావు, డాక్టర్ దేవపాలన, జ్యోతి చం ద్రమౌళి, అన్నమనేని వెంకటరావు, బండారు ఆనందరావు పాల్గొన్నారు.

మాధవస్వామికి వెండి పాదాలు బహూకరణ

అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని మాధవ స్వామి దేవాలయంలో చామర్తి లక్ష్మీనాథ్, నాగమణి దంపతులు సుమారు రూ.70వేల విలువైన స్వామి వారి అలంకరణకు వినియోగించే వెండిపాదాలను సోమవారం బహూకరించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో భోగి పండుగ ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి చిన్నారులకు ఈవో తిమ్మానాయుడు, పూజారులు భోగి పండ్లు పోశారు. చిన్నారుల తల్లిదండ్రులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బైక్.. యువకుడికి గాయాలు

మేదరమెట్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో ముందు వెళ్తున్న కారును మోటర్ సైకిల్ వెనుక ఢీకొన్న సంఘటనలో మోటర్ సైకిల్‌పై ఉన్న యువకుడికి గాయాలయ్యాయి. సోమవారం హైవేలో విజయవాడ వైపు వెళ్తున్న కారును వెనుక వస్తున్న మోటర్ సైకిల్ ఢీకొంది. మోటర్ సైకిల్‌పై వెనుక కూర్చున్న గోపి రాము గాయపడ్డాడు. రామును హైవే అంబులెన్స్ అద్దంకి ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

జాతీయ రహదారిలో తిమ్మనపాలెం చెక్ పోస్టు వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ విజయవాడ వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్లే మార్గంలో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వ్యక్తి స్పృహలో లేకపోవడం వలన వివరాలు తెలియలేదు. క్షతగాత్రుడిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ఐదుగురు అరెస్టు

ఇంకొల్లు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలోని పావులూరు శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై సోమవారం ఎస్ఐ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న 2 కోడి పుంజులు, రూ.1300 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు సంక్రాంతి ప్రత్యేక పూజలు

అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలతో పాటు జ్యోతి దర్శనం ఏర్పాటు చేసినట్లు దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 5 గంటలకు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, సాయంత్రం 6-39 గంటలకు అయ్యప్పస్వామి దేవాలయం ఎదురు ఉన్న అద్దంకి కొండపై జ్యోతి దర్శనం, 18 మెట్లకు పడి పూజ కార్య క్రమాలు జరుగుతాయని తెలిపారు.

వైభవంగా ఆరుద్రోత్సవం



చిదంబరేశ్వరస్వామి గ్రామోత్సవం

చినగంజాం : గంగా పార్వతి సమేత చిదంబరేశ్వరస్వామి దేవస్థానంలో ఆరుద్ర మహోత్సవాన్ని (శివ ముక్కోటి) వైభవంగా నిర్వహించారు. శివుని జన్మనక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం వేకువజాము నుంచి వేదపండితులు ఆలయంలోని స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అభిషేకాలను నిర్వహించారు. ఆలయ పుజారి కాకుమాను రాము ఆధ్వర్యంలో గంగా పార్వతి సమేత చిదంబరేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలతో, పలు రకాల పూలమాలలతో ప్రత్యేకంగా నంది వాహనంపై అలకరించారు. పూజలు అనంతరం భక్తులు నంది వాహనంపై స్వామి వారిని ఉంచి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణాలు చేయించారు. ఉత్తర ద్వార దర్శనంలో ఉన్న స్వామిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. తదనంతరం గ్రామ పుర వీధులలో స్వామి వారికి గ్రామెత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కడవకుదురు, గొనసపూడి, కొత్తపాలెం తదితర గ్రామాల్లో ఆరుద్రోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

వైసీపీ హయాంలో సంక్షేమం శూన్యం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అభివృద్ధి, సౌకర్యాలు శూన్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనర సింహారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక ఎస్సీ -2 హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్ పరి సరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవర్గాలకు చెందిన కుటుంబాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం గాలి కొదిలేసిందన్నారు. కనీస వసతులు కూడా లేక పోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆవే దన వ్యక్తం చేశారు. హాస్టళ్లల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పనకు విప్ల వాత్మక మార్పులు తీసుకురానున్నట్లు డాక్టర్ ఉగ్ర చెప్పారు. హాస్టల్‌లో వసతుల కల్పనకు అవసరమైన పనులు చేపట్టేందుకు తగిన కార్యాచరణపై సర్వశిక్షా అభియాన్ అధికారులతో మాట్లాడారు. ఈమేరకు తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

తగ్గేదేలే.. తేల్చుకుందాం

- బెల్ట్ షాపుల నిర్వహణలో ఆధిపత్య పోరు
- చీరాలలో నా మాట వినకపోతే అంతే అంటున్న అధికార పార్టీ నాయకుడు
- ఎక్సైజ్ అధికారులు నా చేతుల్లో ఉన్నారని దబాయింపు
- ఎమ్మెల్యే పేరు చెప్పి హల్‌చల్
- పర్చూరు నియోజకవర్గంలో కుదిరిన ఒప్పందాలు
- అన్ని చోట్లా అనధికార సిట్టింగ్‌లు
- హద్దులు మీరుతున్న వారి తీరు



వేటపాలెం పోలీసులు పట్టుకున్న మద్యం నిల్వలు (ఫైల్)



ఇంకొల్లులో బార్‌ను తలపిస్తూ మద్యం సేవించేందుకు టేబుల్‌లో ఉన్న మద్యం సీసాలు

చీరాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో లిక్కర్ సిండికేట్ల మధ్య ఆధిపత్య పోరు పతాక స్థాయికి చేరింది. దీంతో సంబంధిత అధికారులు స్వామి కార్యం, స్వకార్యం అన్న చందంగా పబ్బం గడుపుకుంటున్నారు. అంతిమంగా మందుబాబులు నష్టపోతున్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ బహిరంగంగానే సాగుతున్నాయి. ఈ క్రమంలో ఆధిపత్య పోరు సాగుతోంది. అది పతాక స్థాయికి చేరింది. చీరాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే పేరు చెప్పి మున్సిపల్ పరిధిలోని ఓ ప్రజాప్రతినిధి భర్త అంతా తానై ఇటు ఎక్సైజ్ అటు పోలీస్‌లకు తలనొప్పిగా తయారయ్యాడని ఆయా డిపార్ట్‌మెంట్లలోని అధికారులు, సిబ్బంది మధ్య చర్చ సాగుతోంది. ఈ క్రమంలో ఇతర లైసెన్సీలు తాము మాత్రం తగ్గేదేలే.. తేల్చుకుందామంటూ సంకేతాలు ఇస్తున్నారు. ఇదంతా ఎమ్మెల్యేకు తెలిసి జరుగుతుందా లేకుంటే ఎమ్మెల్యే పేరు చెప్పి ఆ మద్యం వ్యాపారి తన దందా సాగించేందుకు అధికారులను, మద్యం వ్యాపారులను మభ్య పెడుతున్నారా అని ఆయా వర్గాల్లో చర్చ సాగుతోంది. ఆ క్రమంలో ఇటీవల నెలకొన్న పరిణామాలు చర్చనీయాంశమయ్యాయి.

పట్టుబడ్డ మద్యం సీసాలు ఏ షాపు నుంచి సరఫరా అయ్యాయి

ఇటీవల వేటపాలెం మండలం కఠారిపాలెం సమీపంలో 265 క్వార్టర్ బాటిళ్లు, 25 బీర్ సీసాలను వేటపాలెం పోలీసలు పట్టుకున్నారు. అది అక్రమంగా విక్రయించేందుకు ఉంచిన సరుకు. వాస్తవానికి సదరు మద్యం సీసాలు ఏ మద్యం దుకాణం నుంచి తెచ్చారనేది తెలుసుకునేందుకు పెద్ద సమయం పట్టదు. ఎందుకంటే ఆయా మద్యం సీసాలపై ఉన్న బార్ కోడ్ ఆధారంగా ఏ మద్యం దుకాణం నుంచి వచ్చాయనేది తెలిసిపోతుంది. అయితే సదరు విచారణకు నెల రోజుల సమయం ఉంటుందని ఆలోపు తాము పూర్తి నివేదిక తయారు చేస్తామని వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు చెప్తున్నారు.

4 క్వార్టర్ బాటిళ్లు ఉన్నందుకు కేసు

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం హాయ్ రెస్టారెంట్ సమీపంలో ఓ వ్యక్తి నాలుగు క్వార్టర్ బాటిళ్ల మద్యం కలిగి ఉన్నాడని ఎస్సై నాగశ్రీను నిందితునిపై కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారు. వాస్తవానికి ఒక వ్యక్తి వద్ద మూడు బాటిల్స్ ఉండొచ్చు. అయితే ఎమ్మెల్యే అంతా తననే చూచుకోమన్నాడని చెప్తూ, సదరు మహిళా ప్రజాప్రతినిధి భర్త పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసు నమోదు చేయించాడని ప్రచారం జరుగుతోంది. అయితే ఎమ్మెల్యే అనుంగ అనుచరులు అందులో ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని ఆయన పేరును బదనాం చేసేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే సహించేది లేదని ఘాటుగా చెప్తున్నారు.

పర్చూరు నియోజకవర్గంలో కుదిరిన ఒప్పందాలు

పర్చూరు నియోజకవర్గంలో బెల్ట్ షాపుల నిర్వహణకు ఒప్పందాలు కుదిరి సజావుగా సాగుతున్నాయి. అందులో భాగంగా పలు ప్రాంతాల్లో సిట్టింగ్‌లకు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అందుకు వారికి తగిన ప్రతఫలం అందుతుందని విషయం తెలిసిన వారు అంటున్నారు.

పోలీస్ వ్యవహారం చక్కబెట్టేందుకు ఓ మాజీ సిండికేట్ వ్యాపారి

చీరాల నియోజకవర్గంలో పోలీస్ పరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా వ్యవహారాన్ని చక్కబెట్టేందుకు మాజీ సిండికేట్ వ్యాపారి బాధ్యతలు తీసుకున్నాడు. ఇతను గతంలో ఆర్థిక లావాదేవీల్లో నమ్మకాన్ని కోల్పోయాడు. అయితే పోలీస్‌తో లావాదేవీలు నడపటంలో సిద్ధహస్తుడనే పేరుతో అతనికి ఓ వర్గం బాధ్యతలు అప్పగించారు. మిగిలిన రెండు వర్గాలు ఆచితూచి అడుగులు వేస్తున్నాయి.

అదనపు ధరలకు అమ్ముదాం..

తలా నాలుగు రూపాయలు పంచుకుందాం

చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహణలో లైసెన్సీలు ఒక అవగాహనకు వచ్చారు. అయితే ఆయా బెల్ట్ షాపుల్లో క్వార్టర్‌ను ఎంత అదనపు ధరకు విక్రయించాలనే విషయమై ఏకాభిప్రాయం రాలేదు. కొన్ని చోట్ల క్వార్టర్‌కు రూ.10 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో అదనపు ధర కూడా ఒకే విధంగా ఉండాలని చర్చలు జరుపుతున్నారు. దీంతో అంతిమంగా మందుబాబుల జేబులకు చిల్లులు పడనుంది.

ఒక్కో షాపునకు రూ.1 లక్ష చెల్లింపు

మద్యం దుకాణాల లైసెన్సీలు తమకు అనుకూలంగా వ్యవహరించేందుకు చూసీచూడనట్లు వ్యవహరించేందుకు ఎక్సైజ్ అధికారులకు ఒక్కో దుకాణంకు రూ.1 లక్ష చెల్లించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో పోలీస్ శాఖ పరంగా తమ సంగతేంటని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా నిబంధనలను ఎంత అతిక్రమిస్తే సంబంధిత అధికారులకు అంత ప్రయోజనం చేకూరే విధంగా ఉంటుందని చెప్పుకుంటున్నారు. అంతిమంగా మద్యపాన ప్రియులు నష్టపోతారని, అది జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



ముగ్గుల పోటీలో విజేతలైన మహిళలకు బహుమతులు అందజేస్తున్న గ్రామ సర్పంచ్ నారాయణరావు

గొనసపూడి (చినగంజాం), జనవరి 13(ఆంధ్రజ్యోతి) : సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగని సర్పంచ్ విక్రం దీప్తి, లాయిడ్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత విక్రం నారాయణరావులు అన్నారు. మండలంలోని గొనసపూడి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామ సంక్రాంతి సంబరాల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి రంగవల్లుల పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాల వారికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కృష్ణ, గుంటూరు, నెల్లూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల తదితర జిల్లాల నుంచి 100 మంది మహిళలు ముగ్గుల పోటీలకు హాజరైనట్లు సంక్రాంతి సంబరాల కమిటీ అధ్యక్షుడు పొద శేషగిరిరావు తెలిపారు. రాష్ట్ర స్థాయి రంగవల్లుల పోటీల్లో చిన గంజాం మండలం మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన నిదర మాదవి ప్రథమ బహుమతి రూ.55,555, చీరాలకు చెందిన వలంపట్ల సుప్రజ రెండవ బహుమతి రూ.25,555, గొనసపూడి గ్రామానికి చెందిన బొప్పన సురేఖకు రెండవ బహుమతి రూ.25,555లు, మూడవ బహుమతులను విజయవాడకు చెందిన ఏ.లత, పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన ఎ.కోటేశ్వరమ్మ, బూదవాడ గ్రామానికి చెందిన వి.వెంకట ఇందులకు ఒక్కొక్కరికి రూ.10,555 నగదు బహుమతులను గ్రామ సర్పంచ్, విక్రం నారాయణరావు, టీడీపీ నాయకులు అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా టీడీపీ పర్చూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జరుబుల సంధ్యారాణి, మండల మహిళా అధ్యక్షురాలు కావూరి శారద, యద్దనపూడి మండల మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, పొద వెంకాయమ్మ, కందిమళ్ళ పూర్ణచంద్రరావులు వ్యవహరించారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కొండ్రగుంట శ్రీహరి బాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి బత్తుల శ్రీనివాసరావు, విక్రం అజయ్‌బాబు, దివ్వ కోలు రాము, నార్నే సత్యనారాయణ పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు

పర్చూరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలం నాగులపాలెం గ్రామంలోని పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ముగ్గుల పోటీలకు స్పందన లభించింది. మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులను సుందరంగా తీర్చి దిద్దారు. గెలుపొందిన మహిళలకు నిర్వహకులు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.15,116ను దమ్మాటి జానకి, రెండవ బహుమతి రూ.10,116లను బత్తుల కరుణ, మూడవ బహుమతి రూ.5,116ను కొల్లా శ్రీలక్ష్మి కౌవసం చేసుకొని విజేతలుగా నిలిచారు. కన్సొలేషన్ బహుమతి ముద్దన శివ కుమారి దక్కించుకున్నారు.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ



అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం లక్ష తమలపాకుల పూజ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం నిర్వహించారు. అనంతరం అభిషేకం, అలంకరణ చేశారు. వేదపండితులు, పూజారులు 11 ఆవృత్తములుగా లక్ష తమలపాకులతో పూజ నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోధ దంపతులు పాల్గొన్నారు. భోగి పండుగ, శివముక్కోటి కూడా కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఏర్పాట్లు ను ఈవో తిమ్మానాయుడు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి గ్రామోత్సవం

పంగులూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : చందలూరు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవం భక్త సందోహంతో సందడిగా సాగుతోంది. సోమవారం అమ్మవారికి వేద పండితులు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లలిత సహస్ర నామార్చన, చండీ మూలమంత్ర అనుష్ఠానం, సప్త శతిపారాయణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి చండీ మూలమంత్ర జపంతో కలశంపై అమ్మవారి బింబంతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం పంచసూక్త పారాయణం, లలిత సహస్ర నామార్చన, మహా నైవేద్యం, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం జరిగింది. విద్యుత్ దీపాలంకరణతో నిర్మితమైన ప్రభ ఊరేగింపు ప్రతేక ఆకర్షణగా సాగగా, మహిళల కోలాట ప్రదర్శన అలరించింది. వేలాది మంది భక్తులతో గ్రామ పురవీధులలో జరిగిన అమ్మవారి గ్రామోత్సవం తిరునాళ్లను తలపించింది.

సహకారంపై కుస్తీ!

- సింగిల్ విండోలపై ముమ్మర కసరత్తు
- తప్పని అలకలు, అసంతృప్తులు
- నాలుగు రోజుల్లో జాబితాలు ఇవ్వాలని ఆదేశాలు
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు బిజీబిజీ
- పండుగలకన్నా పదవులపైనే గ్రామ నేతల దృష్టి.

సొసైటీల పదవులపై అధికారపార్టీలో ముమ్మర కసరత్తు సాగుతోంది. గ్రామాల్లో ఒకపక్క సంక్రాంతి పండుగ హడావుడి నడుస్తుండగా సొసైటీల వారీ టీడీపీ ముఖ్య నేతలంతా ఈ అంశంపైనే దృష్టిపెట్టారు. కీలకమైన వాటిల్లో పోటీ పెరగటంతో ఆయా నియోజకవర్గాలోని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఏకాభిప్రాయం కోసం కుస్తీపడుతున్నారు. ఎక్కువశాతం ఏకాభిప్రాయంతో జాబితా తయారు చేస్తున్నప్పటికీ పలు సొసైటీల విషయంలో కింది స్థాయి నాయకుల మధ్య పోటీ పెరిగి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకు తలనొప్పిగా మారింది. అలకలు, అసంతృప్తులు కూడా ఆరంభమయ్యాయి.



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రప్రభుత్వం సహకార వ్యవసాయ పరపతి సంఘాల(సొసైటీల)కు అనధికారిగా త్రీమెన్ కమిటీలను నియమించాలని నిర్ణయించింది. ఆ మేరకు ఒక్కక్క సొసైటీకి ఒక పర్సన్ ఇన్‌చార్జిగా ఒకరి పేరు, కమిటీ సభ్యులుగా ఇద్దరి పేర్లను ఎంపిక చేయాల్సి ఉంది. దీంతో అధికార టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకు నియోజకవర్గాల పరిధిలోని సొసైటీలకు త్రీమెన్ కమిటీలను నియమించేందుకు అవసరమైన పేర్లు సూచించాలని అధిష్ఠానం ఆదేశాలు జారీచేసింది. 16 లేక 17 తేదీల కల్లా జాబితాలు పంపాలని కూడా ఆదేశించారు. దీంతో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు కిందిస్థాయి నాయకులకు సమాచారం ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 174 సింగిల్ విండోలు ఉండగా వాటన్నింటికీ త్రీమెన్ కమిటీలు నియమించాల్సి ఉంది. జిల్లాలో పర్చూరు, అద్దంకి, ఎస్ఎన్‌పాడు, కొండపి, కందుకూరు, దర్శి నియోజకవర్గాల్లో ఎక్కువగా సింగిల్ విండోలు ఉన్నాయి. ఆ తర్వాత కనిగిరి, మార్కాపురం, వైపాలెం గిద్దలూరుల్లో కనీసంగా నాలుగు నుంచి ఎనిమిది వరకు సొసైటీలు ఉన్నాయి. అతి తక్కువగా ఒంగోలు నియోజకవర్గంలో మూడు మాత్రమే ఉన్నాయి. ఈ సొసైటీలకు త్రీమెన్ కమిటీలు నియమించిన తర్వాత సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ)కి కూడా పాలక మండలిని నియమించే అవకాశం ఉంది. దీంతో గత ఆరు నెలలుగా సెంట్రల్ బ్యాంకు అటు సొసైటీలపై ఉన్న అధికారుల పెత్తనం పోతుంది.

కీలక సొసైటీల్లో పోటీ

తాజా పరిస్థితిని పరిశీలిస్తే.. దాదాపు అన్నీ నియోజకవర్గాల్లో కీలక సొసైటీల పరిధిలో టీడీపీ నాయకులు పర్సన్ ఇన్‌చార్జి పదవి కోసం పోటీ పడుతున్నారు. అలాంటి చోట ఎవరిని ఎంపిక చేయాలనే విషయంలో ఎమ్మెల్యేలు కూడా ఇబ్బందిపడుతున్నారు. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కొందరు కిందిస్థాయి నాయకులకు, కొందరు తమ వ్యక్తిగత సిబ్బందికి సొసైటీల వారీ నాయకులతో మాట్లాడే బాధ్యత అప్పగించారు. అయితే వారి మాట కూడా వినని పరిస్థితి ఉంది. దీంతో తీవ్ర పోటీ నెలకొన్న సొసైటీల విషయంలో ప్రత్యక్షంగా ఎమ్మెల్యేలే జోక్యం చేసుకోక తప్పటం లేదు. ఉదాహరణకు అత్యధికంగా 32 సింగిల్ విండోలు ఉన్న అద్దంకి నియోజకవర్గంలో రెండు సొసైటీల్లో నాయకుల మధ్య ఏర్పడిన తీవ్రమైన పోటీతో మంత్రి రవికుమార్ జోక్యం చేసుకోక తప్పలేదు. బల్లికురవ, వెల్లచెరువు పీఏసీఎస్‌ల పరిధిలో నాయకుల మధ్య ఏకాభిప్రాయం ఏర్పడలేదు. వెల్లలచెరువులో అయితే గ్రామంలో దేవాలయాల నిర్మాణానికి ఎవరు ఎక్కువ నిధులు ఇస్తే వారే పదవి తీసుకోవాలని ఒకవర్గం ప్రతిపాదించినట్లు తెలిసింది. మరో వర్గం వారు ఆ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు. బల్లికురవ సొసైటీ పరిధిలో ఇద్దరు, ముగ్గురు నాయకుల మధ్య నెలకొన్న పోటీని కిందిస్థాయి నాయకులు నివారించలేకపోయారు. మంత్రి రవికుమార్ రెండు రోజుల్లో తానే తుది నిర్ణయం తీసుకుంటానని చెప్పినట్లు తెలిసింది.

ఏకాభిప్రాయం కోసం యత్నాలు

అదేస్థాయి సొసైటీలు ఉన్న పర్చూరు నియోజకవర్గంలో కూడా నాలుగు సొసైటీల్లో పోటీ తీవ్రంగా ఉంది. ఎమ్మెల్యే సాంబశివరావు ఏకాభిప్రాయం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో 20 సొసైటీలు ఉండగా చీమకుర్తి మండలంలో ఐదింటికి స్థానిక నాయకులతో మాట్లాడి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ జాబితాను సిద్ధం చేశారు. అయితే వారిలో పల్లామల్లి, కేవీపాలెం సొసైటీల పీఐసీ పదవులకు ఎమ్మెల్యే ఎంపిక చేసిన వారు తాము సిద్ధంగా లేమని చెప్పినట్లు తెలిసింది. చీమకుర్తి సింగిల్ విండోకు ఎమ్మెల్యే కూనాటి వెంకటరావు పేరు ఖరారు చేయగా మరో సీనియర్ నాయకులు హనుమంతరావు తనకే అవకాశం ఇవ్వాలని గట్టిగా పోటీలో ఉన్నారు. మద్దిపాడు మండలంలో నందిపాడు సొసైటీకి నాగేశ్వరరావు పేరు ఖరారుచేయగా దొడ్డవరం సొసైటీకి ముగ్గురు పోటీపడుతున్నారు. ఎస్ఎన్‌పాడులో పలు సొసైటీల్లో నాయకుల మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో అన్నీచోట్ల పదవులపై తానే నిర్ణయం తీసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. దీనిపై మండల పార్టీ అధ్యక్షుడు మరికొందరు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. ఎన్‌జీపాడు మండలంలో ఆయా సొసైటీలకు ఇటు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అటు మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి అనుచరుల మధ్య పోటీ తీవ్రస్థాయికి చేరింది.

అక్కడక్కడా అలకలు

కొండపి నియోజకవర్గంలో 17 సొసైటీలు ఉండగా ఇటు మంత్రి స్వామి అటు మారిటైం బోర్డు చైర్మన్ సత్యాలు బిజీగా ఉండటంతో దామచర్ల పూర్ణచంద్రరావు అన్నీ సొసైటీలలో ఏకాభిప్రాయం కోసం కసరత్తు చేస్తున్నారు. చిరికూరపాడు సొసైటీకి ముగ్గురు నాయకులు పోటీపడటంతో తలనొప్పిగా మారినట్లు తెలిసింది. దీంతో పోటీపడుతున్న నాయకులంతా మంత్రి స్వామి మారిటైం చైర్మన్ సత్యల వద్ద తేల్చుకుంటామని వారి వద్దకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం. కందుకూరు నియోజకవర్గంలో ఏకాభిప్రాయ సాధన కోసం ఎమ్మెల్యే నాగేశ్వరరావు చేసిన ప్రయత్నాలు కొన్నిచోట్ల ఫలించలేదు. దీంతో ఎమ్మెల్యే ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ కొందరు లోకేష్‌కు ఫిర్యాదులు చేశారు.

దర్శిలో ప్రతిష్టాత్మకం

దర్శి నియోజకవర్గంలో 14 సొసైటీలు ఉండగా ఏకాభిప్రాయంతో ఎంపికలు పూర్తిచేసేందుకు ఇన్‌చార్జి లక్ష్మీ, ఆ పార్టీ నాయకులు లలిత్‌సాగర్ చర్చలు జరుపుతున్నారు. అయితే ఆరు సొసైటీల్లో నాయకులు మధ్య పోటీ నెలకొనగా నాలుగు సొసైటీల్లో నాయకులు రాజీకి ససేమిరా అనటంతో ప్రతిష్టాత్మకంగా మారింది. కనిగిరిలో ఎనిమిది సొసైటీల్లో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి ఒక్కటి మినహా మిగిలిన వారంతా మీరు చేసే ఎంపిక మాకు శిరోధార్యమని తేల్చిచెప్పారు. గిద్దలూరు నియోజకవర్గంలో తొమ్మిది సొసైటీల్లో మూడుచోట్ల నాయకుల మధ్య పోటీపెరగటంతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి నాయకులతో చర్చలు ప్రారంభించారు. మార్కాపురం నియోజకవర్గంలో ఈ విషయంపై సోమవారం దృష్టిపెడతానని ఎమ్మెల్యే నారాయణరెడ్డి చెప్పినట్లు తెలిసింది. వైపాలెం నియోజకవర్గంలో కొందరు నాయకులు నేరుగా అధిష్ఠానంను సంప్రదించగా ఇన్‌చార్జి ఎరీక్షన్‌బాబు చెబితేనే ఎంపికలు జరుగుతాయని చెప్పటంతో అతనిని వ్యతిరేకిస్తున్న నాయకులంతా తర్జనభర్జన పడుతున్నారు.

వైభవంగా భోగి


గొనసపూడిలో రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

» వేకువజాము నుంచే ఇళ్ల ముందు మంటలు
» చిన్నారులు, యువత, వృద్ధుల సందడి
» రంగవల్లులతో వీధులు కళకళ


కారంచేడు భోగి వేడుకల్లో పాల్గొన్న మహిళలు

అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : భోగి పండుగను సోమవారం వైభవంగా జరుపుకున్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద సోమవారం వేకువజామున ఈవో తిమ్మానాయుడు, పూజారులు ఆధ్వర్యంలో సంప్రదాయ పూజలు నిర్వహించి భోగి మంటను వేశారు. అద్దంకి పట్టణంలోని హరిహర గోకులం వద్ద వాస వీవనితాక్లబ్ ఆధ్వర్యంలో భోగిని వైభవంగా నిర్వహించారు. భోగి మంటలతో పాటు చిన్నారులకు సంప్రదాయ దుస్తుల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతల గార్లపాటి శ్రీనివాసరావు, వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ వూటుకూరు ఉమా అన్నపూర్ణ, రీజనల్ చైర్మన్ ఐతా శివనాగరాజు, ఆత్మకూరు ఆంజనేయులు, ఉడత్తు ఆదినారాయణ, చుండూరు గాయత్రి, రాఘవేంద్రరావు, గ్రంధి నాగరాజకుమారి, కొల్లిపర లావణ్య, లషుమారపు పద్మావతి, తాతా శిరీష తదితరులు పాల్గొన్నారు. అద్దంకి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో హిందువులు తమ ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

బల్లికురవ : భోగి పండగను సోమవారం ప్రజలు సందడిగా జరుపుకున్నారు. ఇళ్ల ముంగిట భోగి మంటలను వేశారు. వీర్ల గంగమ్మ ఆలయం వద్ద భక్తులు వేసిన ముగ్గు ఆకట్టుకుంది.

చినగంజాం : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని భోగి వేడుకలను మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం వేడుకలు సోమవారం భోగి మంటలతో ప్రారంభమయ్యాయి. వేకువజాము నుంచే గ్రామాల్లోని పెద్దలు, యువకులు, చిన్నారులు, ప్రధాన రహదారిల్లోని కూడళ్లలో, ఇళ్ల ముందు ఆనందోత్సాహాలతో భోగి మంటలను వేశారు. మహిళలు ఇంటి ముందు రంగవల్లులు తీర్చిదిద్ది వాటిపై గొబ్బెమ్మలను ఉంచి పూలతో అలంకరించారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు, స్నేహితులు రాకతో పల్లెలోని లోగిళ్లన్నీ కళకళలాడాయి. పలు గ్రామాల్లో వేకువజాము నుండే పండుగ వాతావరణం నెలకొంది. భోగి పండుగను పురస్కరించుకొని స్థానిక భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో చిన్నారులకు భోగి పండ్లను పోశారు.

మార్టూరు : మండలంలోని గ్రామాలలో భోగి పండుగ సందర్భంగా సోమవారం వేకువజామున వీధులలో భోగి మంటలతో సంక్రాంతి పండుగకు స్వాగతం పలికారు. పట్టణాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు సంక్రాంతి పండుగకు ఇళ్లకు చేరడంతో గ్రామాల్లో సందడి మొదలైంది. నేతాజీనగర్, తూర్పుబజారున, బలరాంకాలనీ, చౌదరి కాలనీ, విద్యానగర్ తదితర భోగిమంటలు వేశారు.


శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద భోగి మంట వేస్తున్న ఈవో తిమ్మానాయుడు, పూజారులు

సంక్రాంతి ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలి

మంత్రి రవికుమార్

అద్దంకి : సంక్రాంతి వేడుకలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ వేళ తెలుగు లోగిళ్లు అలనాటి అనుభూతులకు వేదికలుగా మారతాయన్నారు. ప్రత్యేకించి గ్రామాలలో నెలకొనే సందడి అనిర్వచనీయం అన్నారు. ధాన్య సిరులు, సిరి సంపదలతో రైతులు జరుపుకునే సంక్రాంతి వేడుక గ్రామాలలో సంక్రాంతి శోభను ఇనుమడింప చేస్తాయన్నారు. రాష్ట్ర ప్రజలందరూ మకర సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని మంత్రి రవికుమార్ ఆకాంక్షించారు.

పంగులూరు : భోగి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం తెల్లవారుజామున భోగి మంటలు వేస్తూ సందడి చేశారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల చిన్నారులకు సంప్రదాయంగా రేగిపళ్లతో భోగి పళ్లు పోస్తూ ఘనంగా వేడుక నిర్వహించారు.

పర్చూరు : పర్చూరు మండలం, కారంచేడు గ్రామాల్లో భోగి పండుగ వేడుకలను ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. యువకులు, మహిళలు, వృద్ధుల సైతం ఉత్సాహంగా పాల్గొని ఆనందోత్సవాలు జరుపుకున్నారు.




అద్దంకిలోని హరిహర గోకులం వద్ద భోగి మంట వెలిగిస్తున్న టీడీపీ నేతల గార్లపాటి, వాసవీ వనితా క్లబ్ సభ్యులు, మార్టూరులో నేతాజీనగర్‌లో భోగి మంటల వద్ద యవతీ యువకులు, బల్లికురవ : గంగమ్మ ఆలయం ముందు వేసిన పెద్ద ముగ్గు

రేపటి నుంచి నాటికల పోటీలు



నాటికల ప్రదర్శనకు సిద్ధమవుతున్న వేదిక

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో బుధవారం రాత్రి స్వర్గీయ పెడవల్లి కామేశ్వరరావు కళా ప్రాంగణంలో ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ నాటిక పోటీలకు ముఖ్య అతిథిగా అమరావతి జేఏసీ కన్వీనర్ పువ్వాడ సుధాకర్ పాల్గొంటున్నారు. రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు జనాబ్ మహమ్మద్ షరీఫ్‌కు కళాపరిషత్ సభ్యులు సన్మానం చేయనున్నారు. కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీల కోసం వేదికను సుందరంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాత్రి సమయాలలో మంచు కురుస్తున్నందువలన నాటిక పోటీలను తిలకించడానికి వచ్చే ప్రేక్షకులకు ఇబ్బందులు కలగకుండా షామియానాలను ఏర్పాటుచేస్తున్నారు. వరుసగా నాలుగురోజులు నాటికలను ప్రదర్శిస్తారు.

ప్రదర్శించే నాటికలు

బుధవారం రాత్రి సభాకార్యక్రమం అనంతరం మొదటిగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే స్వేచ్ఛ నాటికను ప్రదర్శిస్తారు. తరువాత న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారిచే ఐ ఏట్ ఇండియా నాటికను, తర్వాత మూడవ నాటికగా శ్రీసద్గురు కళా నిలయం గుంటూరు వారిచే కమనీయం నాటికను ప్రదర్శిస్తారు.

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం

అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థాన అల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అద్దంకిలోని భవానీ సెంటర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో నెల రోజుల నుంచి చిన్న జీయర్ స్వామి శిష్యురాలు స్వర్ణ అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న తిరుప్పావై ప్రవచనాలు సోమవారం ముగిసాయి. సోమవారం భోగి పండుగ సందర్భంగా గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో గుంటూరు నాగేశ్వరరావు, చల్లగుండ్ల సాయిబాబా దంపతులు, స్వర్ణ వెంకటసుబ్బారావు, పోతేపల్లి రాము, కొండముది బాపూజీ, సోడా వెంకటేశ్వర్లు, గుంటూరు జయమ్మ, చల్లగుండ్ల సుబ్బాయమ్మ, జయశ్రీ, కొండముది ఆంజనేయులు పాల్గొన్నారు.


తిరుప్పావై ప్రవచనాలు చెప్తున్న చిన్నజీయర్ శిష్యురాలు స్వర్ణ అన్నపూర్ణ

ముగిసిన ధనుర్మాస ప్రత్యేక పూజలు

మార్టూరు : ధనుర్మాసం ముగింపుసందర్భంగా సోమవారం మండలంలోని ద్రోణాదుల గ్రామంలోని రామాలయంలో గోదారంగనాథ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం అర్చకులు అళహరి పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రయుక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి పెళ్లితంతును కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా, బొడ్డురాయి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి తాళిబొట్టును తీసుకువచ్చారు. తర్వాత వేదమంత్రాలు చదువుతుండగా స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించిన భక్తులు పరవశించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని ఇసుకదర్శి పాండురంగస్వామి దేవస్థానంలో గోదా కల్యాణాన్ని వేడుకగా నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు.

పూర్వ విద్యార్థుల సందడి

» వేర్వేరుచోట్ల కలిసిన స్నేహితులు
» గుర్తు చేసుకున్న పాత జ్ఞాపకాలు
» గురువులకు ఆత్మీయ సత్కారాలు

పంగులూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ పలుకరింపులు, ఆటపాటలతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. మండలంలోని ముప్పవరం గ్రామ పీఎస్ఎన్‌సీసీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 1988వ టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడున్నర దశాబ్దాల కిందట పాఠశాలలో ఆడిన ఆటలు, చేసిన అల్లరిని వారంతా గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా యోగ క్షేమాలు అడిగి పలుకరించుకున్నారు. తమ భవిష్యత్‌ను తీర్చిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకుంటూ గురువులను ఘనంగా సత్కరించారు. తమ ముందు ఆడుతూ పాడుతూ తిరిగిన పిల్లలు జీవితంలో స్థిరపడి ఇప్పుడు కుటుంబాలతో కనిపించడం పట్ల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మారుతి, వెంకారెడ్డి, రాజేంద్ర, శారద, విశ్రాంత హెచ్‌ఎంలు కృష్ణమూర్తి, క్రిష్ణయ్య, హెచ్‌ఎం ప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ముప్పవరం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విశ్రాంత హెచ్‌ఎం కృష్ణయ్యను సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు, ప్రతినిధులు

ఆత్మీయ కలయిక

బల్లికురవ : మండలంలోని కొమ్మినేనివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈసందర్భంగా అప్పట్లో పాఠశాలలో చదివిన 45 మంది విద్యార్థులంతా ఒక చోటుకి చేరి తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉన్నత చదువులతో ఉన్నతంగా ఎదిగినా పాఠశాలను తాము మరిచిపోమని వారు ఈసందర్భంగా తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. గతంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు పంచుమర్తి రామకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వారణాసి జాన్సీలక్ష్మి, యర్రా పేరయ్య, మాదాల వెంకటేశ్వర్లు, షేక్ షబ్బీర్, తాడికొండ వీరకుమార్, పూర్వ విద్యార్థి డాక్టర్ దర్శి రమేష్‌బాబు, సర్పంచ్ యర్రా శాంతి, జడ్పీటీసీ సభ్యుడు అంజలి, ఎంపీటీసీ సభ్యుడు మిన్నెకంటి రామారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

30 ఏళ్ల తర్వాత

సంతమాగులూరు : సంతమాగులూరు మండలంలోని మక్కిన వారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990-94 సంవత్సరపు పూర్వ విద్యార్థుల కలయిక సోమవారం ఘనంగా జరిగింది. సంక్రాంతి పండుగ కోసం సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలతో బిజీబిజీగా ఉండేవారు కుటుంబాలతో గ్రామాలకు తరలివచ్చారు. ఇదే సరైన వేదికగా భావించిన పూర్వ విద్యార్థులంతా కలిశారు. వారంతా ఆదివారం పాఠశాలకు చేరుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకురించుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో తెలుగు, వ్యాయామ, గణిత ఉపాధ్యాయులు బాల సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, రంగా రెడ్డి సార్ విద్యార్థులు కరిముల్లా, గిరి,నాగేశ్వరరావు, షఫీలాల్ బుడే, శుభాని తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు రామకృష్ణ


పూర్ణసూర్యతేజాచారికి నగదు సాయం అందజేస్తున్న సుబ్బారావు మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు

ప్రతిభ చాటిన చందలూరు విద్యార్థులు

పంగులూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు మండలం రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభ పోటీ పరీక్షలో చందలూరు పాఠశాల విద్యార్థులు నగదు బహుమతులు అందుకున్నారు. ఎలగాల సుబ్బారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత నెలలో అద్దంకి, కొరిశపాడు, జె.పంగులూరు, ఇంకొల్లు, బల్లికురవ మండలాల పరిధిలో 10వ తరగతి విద్యార్థులకు గణితం, సైన్స్ పాఠ్యాంశాలలో పోటీ పరీక్ష నిర్వహించారు. ఈ పోటీలో 400ల మంది విద్యార్థులు పాల్గొనగా, చందలూరు పాఠశాల విద్యార్థులు బీసీ విభాగంలో కట్టా హారిక, ఎస్సీ విభాగంలో విప్పర్ల కల్పనలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.10వేల నగదు పారితోషికం అందుకోగా, బిర్రా మణిదీపక్‌రెడ్డి, చల్లా గాయత్రి, పతకమూరి పూర్ణ సూర్యతేజాచారిలకు కన్సొలేషన్ బహుమతిగా రూ.3వేల నగదు పారితోషికం లభించింది. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోపీచంద్ నేతృత్వంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పేద విద్యార్థి సూర్యతేజాచారిని ప్రోత్సహిస్తూ రూ.10 వేల ఆర్థిక సాయం అందచేశారని హెచ్‌ఎం గిరిజ తెలిపారు.

పేదలకు సాయంలోనే ఆనందం

చీరాలటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మానవత్వంతో నిరుపేదలకు సాయం చేయడంలో చెప్పలేని ఆనందం ఉందని పద్మ భాస్కర్ ఫౌండేషన్ ప్రతినిధి గంటా అనిల్‌కుమార్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చీరాల పట్టణ పరిధిలోని నిరుపేదలకు ఆయన నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. తన తల్లి పేరుమీద పేదలకు సాయం చేస్తున్నట్లు చెప్పారు.

పేకాట స్థావరంపై దాడులు.. పలువురి అరెస్ట్

చీరాలటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ హెచ్చరించారు. డీఎస్పీ ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో ఎస్సై నాగశ్రీను కొత్తపేటలోని ఓఇంట్లో దాడులు నిర్వహించారు. ఈనేపథ్యంలో పేకాట నిర్వహిస్తున్న ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేశారు. అలాగే వారి వద్ద నుంచి రూ.4320 నగదును స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాలు, ఇతర జూదాలపై దాడులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వారం కిందట ప్రమాదం



పర్చూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కుమార్తెలు సజీవ దహనమైన ఘటన తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లి దాసరి రాజ్యలక్ష్మి (50)ఆదివారం రాత్రి మృతి చెందారు. స్థానిక తూర్పువారివీధిలో ఉంటున్న రాజ్యలక్ష్మి కుటుంబం ఈనెల 5 అర్ధరాత్రి ఇంట్లో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు కుమార్తెలు నాగమణి(34), మాధవీలత(30) మృతి చెందారు. మంటల్లో కాలిపోతున్న కుమార్తెలను రక్షించే క్రమంలో తీవ్రంగా గాయపడిన రాజ్యలక్ష్మిని గుంటూరుకు తరలించారు. ఇద్దరు కుమార్తెలు, భార్య మృతి చెందడంతో రాజ్యలక్ష్మి భర్త, మతిస్థితిమితం లేని కుమారుడి పరిస్థితి దయనీయంగా మారింది. అమ్మ, అక్కా, చెల్లి మృతి చెందిన విషయం కూడా తెలియని పరిస్థితిలో ఆ యువకుడు ఉండడం అందరినీ కలచివేస్తోంది.

పండగపూట ఘోరం

» రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి
» హాస్పిటల్ వద్ద మిన్నంటిన బంధువుల రోదనలు


మనోహర్ జోష్

చీరాలటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పండుగపూట విద్యార్థి మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో ఓ కుటుంబం కుమారుడిని కోల్పోయింది. దీంతో తల్లిదండ్రులు, బంధువుల రోదన చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద మిన్నంటింది. వివరాల్లోకి వెళితే .. చినగంజాం మండలం మోటుపల్లి పంచాయతీ నిరీక్షణగిరికు చెందిన పొన్నపూడి అబ్రహం మత్స్యకారుడు. ఇతనికి భార్య సుజాత, పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పెద్ద కుమారుడు మనోహర్ జోష్(15), ఏడవ తరగతి చదువుతున్న రత్నకుమార్ సంతానం. సంక్రాంతి పండుగ సందర్భంగా కఠారి పాలెంకు చెందిన పెదనాన్న సీతారామయ్య మరి కొందరు బంధువులతో కలిసి సోమవారం రాత్రి షాపింగ్‌కు రెండు ద్విచక్రవాహనాలపై కఠారిపాలెం నుంచి వేటపాలెం వెళుతున్నారు. మిగిలిన వారు మరో వవాహనంపై వెళుతుండగా మనోహర్, కొండూరి గోపయ్య ఒక బైక్‌పై వెళుతున్నారు. అయితే ఇంటి నుంచి బయలుదేరిని వీరి వాహనాన్ని పదినిముషాల వ్యవధిలోనే కఠారిపాలెం గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు వేగంగా ఢీకొన్నాడు. ఘటనలో మనోహర్ అక్కడికక్కడే మృతి చెందగా, గోపయ్యకు తీవ్ర గాయాలు కావడంతో ముందుగా చీరాల్లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అయితే కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువుల హాస్పిటల్ వద్దకు చేరుకుని బోరున విలపించారు.

సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారం

చీరాలటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంఘటితంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం ఉంటుందని పలువురు మాదిగ సామాజిక వర్గం ప్రతినిధులు అన్నారు. సోమవారం చీరాల అంబేడ్కర్ భవన్‌లో ఆయా సామాజికవర్గం నాయకులు, ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. ముందుగా మాజీ పార్లమెంట్ సభ్యులు మంద జగన్నాథం మృతిపట్ల నివాళులర్పించారు. అనంతరం ఆయా కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మార్పీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సంక్రాంతి శుభాకాంక్షలు

జిల్లాలో సంక్రాంతి సంబరాలు సోమవారం భోగితో మొదలయ్యాయి. ఇప్పటికే 10 రోజులుగా జిల్లా అంతటా ముగ్గుల పోటీలు, ఎడ్ల పందేలు, పిల్లలు.. యువతకు క్రీడా పోటీల సందడి కొనసాగుతోంది. ఆదివారం అర్ధరాత్రి నుంచే ఇళ్ల ముందు, కూడళ్లలో భోగి మంటలను ఉత్సాహంగా వేశారు. కొత్త దుస్తులు ధరించి, దోసెలు ఆరగించి, చుట్టాలు, స్నేహితులతో సంతోషంగా గడిపారు. ఇక, సోమవారంతో ధనుర్మాసం ముగియడంతో వైష్ణవాలయాల్లో గోదాదేవి కల్యాణాలు వైభవంగా జరిగాయి.


రాపూరు : పెంచలకోనలో గోదాదేవి కల్యాణం



నేడు సంక్రాంతి

పెద్దల పండుగకు సిద్ధం ● ఉత్సాహంగా భోగి మంటలు ● వైభవంగా గోదా కల్యాణాలు


కందుకూరులో భోగి మంటలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సూర్య భగవానుడు మకర రాశిలోకి ప్రవేశిస్తుండటంతో మంగళవారం మకర సంక్రాంతి పండుగను జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట పొంగళ్లు పొంగిస్తారు. ఇష్టదైవాలకు పూజలతోపాటు పితృదేవతలను ఆరాధిస్తారు. అందుకే దీనిని పెద్దల పండుగ అని కూడా అంటారు. రవి సంక్రమణం సందర్భంగా పితృదేవతలకు తిల తర్పణాలు వదులుతారు. కొందరు సమాధుల తోటలకు వెళ్లి పెద్దలకు నూతన వస్త్రాలు, ఇష్టమైన పిండి వంటలు సమర్పించి వారి ఆశీస్సులు కోరుతారు. ఈ నేపథ్యంలో నెల్లూరు నగరంతోపాటు అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో శ్మశాన వాటికల వద్ద పెద్దల పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.





ఉత్తర కాలువలో నీటి ప్రవాహం, నిరుపయోగంగా ఎత్తిపోతల పథకం

ఎత్తిపోయిన పథకం

● మరమ్మతుకు గురైన మోటార్లు ● తుప్పుపట్టిన సామగ్రి

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : ఇరవై అడుగుల లోతున ప్రవహిస్తున్న జలాలను ఎత్తిపోసి కాలువ ద్వారా పొలాలకు నీరు ఇచ్చేలా ఏర్పాటు చేసిన ఎత్తిపోతల నిర్మాణాలు నేడు దిష్టిబొమ్మల్లా మారాయి. అనంతసాగరం మండలంలో ఉత్తర కాలువకు అనుసంధానంగా పాతాళపల్లి, కామిరెడ్డిపాడు వద్ద రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పథకాలు నిరుపయోగంగా మారాయి. కొంత కాలం క్రితం మోటార్లు మరమ్మతులకు గురికావడం, పైపులు ఇతర సామగ్రి తుప్పుపట్టడం తదితర కారణాలతో వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. వీటికింద నిర్దేశించిన 600 ఎకరాల ఆయకట్టు రైతులు చేసేదిలేక ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకొన్నారు. పైపుల నుంచి సంప్‌నకు నీరు ఎత్తిపోసి అక్కడ నుంచి కాలువ ద్వారా నీరు ఇచ్చేలా ఎత్తిపోతల నిర్మాణాలు చేపట్టగా కాలువలన్నీ కనుమరగయ్యాయి. నేరుగా ఉత్తర కాలువకు బోర్లు ఏర్పాటు చేసుకొని కొందరు రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు.


తుప్పుపడుతున్న పైపులు

రేపు కనుమ

● పశువుల పండుగ ● పారువేట ఉత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబ రాల్లో మూడో పండుగ కనుమ. దీనిని పశువుల పండుగగా జరుపుకుం టారు. అందుకే ఇది పట్టణాలకంటే పల్లెల్లో ఎక్కువగా జరుగుతుంది. అన్నం పెట్టే భూమిని, ధాన్యం పండించేందుకు కష్టపడే ఎద్దులు, దున్నలు, గేదెలు, ఆవులకు శుభ్రంగా స్నానం చేయించి, వాటి కొమ్ములను రంగులతో ముస్తాబు చేస్తారు. గోశాలను అలంకరిచి గోవులకు ప్రత్యేక పూజలు చేస్తారు. కనుమ సంప్రదాయ వంటకంగా మినప వడలు చేస్తారు. కాగా, నెల్లూరు నగరంలో కనుమ సందర్భంగా పారువేట ఉత్సవం వైభవంగా జరుగుతుంది. ఆలయాల్లో కొలువుదీరిన స్వామివారు, దేవేరులు అందరూ తోటల్లో విహరించేందుకు తరలివస్తారు. స్టోన్‌హౌస్‌పేట నుంచి 3వ మైలు వరకు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా మైపాడు గేట్ సెంటర్లోని జాఫర్‌సాహెబ్ కాలువ ఘాట్‌లో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి తెప్పోత్సవం కనుల పండువగా జరుగుతుంది. తిరునాళ్లను తలపించే ఈ పారువేట ఉత్సవానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తారు.




గుడ్లూరు : చేవూరు అడ్డరోడ్డు వద్ద డివైడర్ పైకి ఎక్కిన కారు, పక్కనే వెంకటేశ్వర్లు మృతదేహం

నలుగురిని మింగిన వేగం

అతివేగం నలుగురిని పొట్టనపెట్టుకుంది. మద్యం మత్తులో ఒకరు.. అవిశ్రాంత డ్రైవింగ్ చేస్తూ మరొకరు ఈ ప్రమాదానికి కారకులయ్యారు. వెంకటాచలం, గుడ్లూరు మండలాల్లో సోమవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. మృతుల్లో ఇద్దరు బాలురు ఉండగా, ఆరుగురికి తీవ్రగాయాలు అయ్యాయి.

- వివరాలు 10లో..

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 2,041 క్యూసెక్కులు ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 70.543 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



ఖాళీగా ఉన్న నవాబుపేట రోడ్డు



ఎస్2 థియేటర్ వీధిని ఇంత ఖాళీగా ఎప్పుడైనా చూశామా?

సంక్రాంతి కర్ఫ్యూ

- స్వగ్రామాలకు పట్టణ ప్రజలు
- బోసిపోయిన నెల్లూరు నగరం
- ఖాళీగా రోడ్లు
- 40 శాతంపైగా బస్సు సర్వీసుల రద్దు

సంక్రాంతి పండుగకు ప్రజలు పల్లెబాట పట్టడంతో నెల్లూరు నగరం బోసిపోయింది. పెద్ద పండుగ కోసం బట్టల షాపింగ్, నిత్యావసరాలు, పిండి వంటల సరుకుల కొనుగోలు, ఇతర పనులపై జిల్లా వ్యాప్తంగా ప్రజలు మూడు రోజులుగా నెల్లూరు నగరానికి లక్షల సంఖ్యలో తరలివచ్చారు. దీంతో నగరంలోని ప్రధాన రహదారులు కిటకిటలాడాయి. అయితే భోగి పండుగ కోసం ఆదివారం రాత్రికి ప్రజలు పల్లెలకు తరలివెళ్లారు. దీంతో సోమవారం నగరం బోసిపోయింది. కేవీఆర్ పెట్రోల్ బంకు కూడలి, ఆర్టీసీ, మద్రాసు బస్టాండు, వీఆర్సీ, గాంధీబొమ్మ సెంటర్.. ఇలా ప్రధాన కూడళ్లలో సైతం పెద్దగా జనం కనిపించలేదు. ఎప్పుడూ రణగొణ ధ్వనులు, ట్రాఫిక్ రద్దీతో ఉండే నగరంలో ఆ హడావిడి తగ్గడం చూపరులకు కొత్త అనుభూతినిచ్చింది.

ఆర్టీసీ బస్టాండ్లు ఖాళీ... పలు సర్వీసులు రద్దు

ప్రజలు నగరాలను విడిచి పల్లె బాట పట్టడంతో జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లు బోసిపోయాయి. నిత్యం రద్దీ ఉండే విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి, చెన్నై రూట్లలో కూడా బస్సులు నిండకపోవడం గమనార్హం. ఈ క్రమంలో ఆర్టీసీ అధికారులు దూర ప్రాంతాలకు వెళ్లే పలు సర్వీసులను రద్దు చేశారు. గ్రామాల కు వెళ్లే బస్సుల సంఖ్యను కూడా తగ్గించారు. సోమవారం 462 సర్వీసులకు గాను 189 సర్వీసులు మాత్రమే నడిని 273 సర్వీసులను రద్దు చేశారు. మొత్తం మీద 59 శాతం బస్సులు మాత్రమే రోడ్డెక్కాయి. ఎప్పుడూ ప్రయాణికులతో కిటకిట లాడే నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండులో సైతం ఖాళీ కుర్చీలు కనిపించాయి. రైల్వే స్టేషన్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

- నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట,ఆంధ్రజ్యోతి)



ఆర్టీసీ ప్రధాన బస్టేషన్‌లో బస్సుల్లేక బోసిపోయిన ప్లాట్‌ఫాంలు



బస్టాండ్లో ఖాళీ కుర్చీలు

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం

నెల్లూరు(క్రైం), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలం కావడంతో బిహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ సంఘటన నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, ఎన్టీఆర్‌నగర్ యాదవ్‌వీధిలో పాలవ్యాపారి మల్లయ్య నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా ఆయన వద్ద బిహార్ రాష్ట్రంలోని ముజపర్‌పూర్‌కి చెందిన సంజయ్‌యాదవ్ పనిచేస్తూ అతడి ఇంట్లోనే ఉండేవాడు. సంజయ్‌యాదవ్ బావమరిది రాకేష్‌కుమార్ యాదవ్(21) గత డిసెంబరు 28న నెల్లూరుకు వచ్చారు. బావతో కలిసి పాల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. రాకేష్‌కుమార్ యాదవ్ తన స్వగ్రామంలో ఓ యువతిని ప్రేమించాడు. కొంతకాలం కిందట వారి మధ్య మనస్పర్థలు రావడంతో ఆ యువతి అతడిని దూరం పెట్టింది. దీంతో ఆయన తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ విషయాన్ని తరచూ బావ సంజయ్ యాదవ్‌కు చెప్పి బాధపడేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఆయన తాను ఉంటున్న గదిలోని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని సంజయ్ యాదవ్ తన యజమానితో కలిసి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు, ఎస్‌ఐ విజయ శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం జీజీహెచ్‌కి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కామాక్షమ్మ 'భోగి' గ్రామోత్సవానికి మంగళం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : భోగి, పెద్ద పండుగ పర్వదినాల్లో జొన్నవాడలోని మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ఏటా గ్రామోత్సవం నిర్వహిస్తారు. అయితే, ఈసారి భోగి రోజే ఆరుద్ర నక్షత్రం రావడంతో శివకామసుందరి, తాండవేశ్వరస్వామిని ఊరేగించి కామాక్షమ్మ గ్రామోత్సవానికి మంగళం పాడారు. ఒకేరోజు రెండు ఉత్సవాలు రావడంతో ఒక ఉత్సవం నిర్వహించి, తాండవేశ్వరుడైనా, మల్లికార్జునస్వామి అయినా ఒక్కరే కదా అని అర్చకులు చెప్పారని ఆలయ ఇన్‌స్పెక్టర్ చెబు తుండటం గమనార్హం. గతేడాది ఆరుద్ర నక్షత్రం రోజు శివకామసుందరికి, తాండవేశ్వర స్వామి రుద్రపాదుకలకు పూజలు చేసిన అనంతరం నిత్యకల్యాణం కూడా నిర్వహించారు. కానీ ఈసారి భోగి ఉత్సవానికి మంగళం పాడేయడం చర్చనీయాంశమైంది.

16న ఐటీఐలో అప్రెంటీస్‌షిప్ మేళా

నెల్లూరు(విద్య), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో పీఎం జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. వారంతా తగిన ధ్రువపత్రాలతో గురువారం ఉదయం 10 గంటలకు ఐటీఐ కళాశాలలో హాజరు కావాలని ఆయన తెలిపారు.

నలుగురిని మింగిన వేగం

- వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు
- వెంకటాచలంలో రెండు బైక్‌ల ఢీ
- తండ్రీకొడుకుల మృతి
- గుడ్లూరులో మోపెడ్‌ను ఢీకొన్న కారు
- మరో ఇద్దరు దుర్మరణం
- ఆరుగురికి గాయాలు

గమ్యానికి త్వరగా చేరుకోవాలన్న ఆతృత.. అపై అతి వేగం... అమాయక ప్రాణాలను బలితీసుకుంటోంది. వెంకటాచలం, గుడ్లూరు మండలాల్లో సోమవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురికి గాయాలు అయ్యాయి.

వెంకటాచలం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఒకరి మద్యం మత్తు.. అతివేగం తండ్రీకొడుకుల ప్రాణాలను బలి తీసుకుంది. వెంకటాచలం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం ఆ కుటుంబానికి శాపంగా మారి ఇంటి పెద్దదిక్కు, వారసుడిని కోల్పోయేలా చేసింది. పోలీసుల కథనం మేరకు... ఇందుకూరుపేట మండలం లేబూరు గ్రామానికి చెందిన షేక్ కాలేషా (45), తన భార్య యాస్మిన్ అలియాస్ జవహీరా, కొడుకు అబ్దుల్ హమీద్ (12)లతో కలిసి బైక్‌పై తన అత్తగారింటికి బయలుదేరారు. లేబూరు నుంచి సైదాపురం మండలం గిద్దలూరు గ్రామానికి వెళ్తుండగా వెంకటాచలంలోని కసుమూరు రోడ్డు కూడలి సమీపంలో ఉన్న కలుజుల వద్దకు వచ్చేసరికి పాలిచెర్లపాడు గ్రామానికి చెందిన తాటిపర్తి చంద్రశేఖర్ పూటుగా మద్యం తాగి బైక్‌పై అతివేగంతో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురూ కింద పడిపోగా షేక్ కాలేషా, హమీద్‌లకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి, ఓ ఆటోలో వారిని సమీపంలో ఉన్న సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) తరలించారు. అయితే, నిమిషాల వ్యవధిలోనే తండ్రీ కొడుకులిద్దరూ ప్రాణాలు విడిచారు. కళ్ల ముందే భర్త, కొడుకు ఇద్దరూ ప్రానాలు వదలడం చూసిన యాస్మిన్ కన్నీటి పర్యంతమైంది. గాయపడిన యాస్మిన్, చంద్రశేఖర్‌లను తొలుత సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం 108లో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలిని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

సీహెచ్‌సీ ఎదుట నిరసన

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తండ్రీ కొడుకులను ఉదయం 9.50 గంటలకు సీహెచ్‌సీకి తరలించారు. ఆ సమయంలో అసుపత్రి సిబ్బంది మాత్రమే ఉండి, గంటన్నర ఆలస్యంగా వైద్యులు రాగా ఈలోపు తండ్రీకొడుకులిద్దరూ మృత్యువాతపడ్డారు. వైద్యుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీహెచ్‌సీ ఎదుట బైఠాయించారు. సకాలంలో వైద్యం చేసి ఉంటే వారు బతికేవారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిపూట కూడా వైద్యులు అందుబాటులో ఉండరని, అలంకార ప్రాయంగా ఉన్న సీహెచ్‌సీపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు.



సీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న స్థానికులు





షేక్ కాలేషా, అబ్దుల్ హమీద్ మృతదేహాలు

పేకాట స్థావరంపై దాడి

పొదలకూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూర్తి గ్రామ సమీపంలోని పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.30,050, నాలుగు వాహనాలు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ హనీఫ్ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది షేక్ రఫీ, రసూల్, మోహన్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు. మండలంలో ఎక్కడైనా జూదం, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుడ్లూరులో మోపెడ్‌ను ఢీకొన్న కారు

కందుకూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు మండలం చేవూరు అడ్డరోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. రావూరు గ్రామానికి చెందిన సరస్వతి, వెంకటేశ్వర్లు (66) మోపెడ్‌పై కావలి నుంచి తన స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని చేవూరు అడ్డ రోడ్డు వద్ద జాతీయరహదారిని క్రాస్‌చేసే ప్రయత్నంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు మోపెడ్‌ను ఢీకొంది. ఆ తర్వాత కారు అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కడంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. మోపెడ్‌పై ఉన్న వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందగా, కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో అద్వికరాజ్ అనే నాలుగేళ్ల చిన్నారి కావలి వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తెలంగాణలోని మంచిర్యాల జిల్లా కొత్తపల్లికి చెందిన మంతెన రాజ్‌కుమార్ తన తల్లి లక్ష్మమ్మ, భార్య, సురేఖ, కుమార్తె అద్వికరాజ్, సమీప బంధువు తేజశ్వితో కలిసి నాగపట్నంలోని వేళాంగిని మాత చర్చిని దర్శించుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



అద్వికరాజ్ మృతదేహం

నారాయణ పంతం... అభివృద్ధికి మంత్రం

సంక్షేమం...అభివృద్ధి రెండు కళ్లుగా మంత్రి నారాయణ నెల్లూరు సిటీ నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో పరుగులు తీయిస్తున్నారు. ఒకవైపు ఆంధ్రుల ఆశల రాజధాని అమరావతి నిర్మాణంలో తలమునకలౌతూ, మరోవైపు సొంత నియోజకవర్గమైన నెల్లూరు సిటీని అభివృద్ధికి శక్తికి మంచి శ్రమిస్తున్నారు. ఎన్నికల్లో తన కోసం కృషి చేసిన కార్యకర్తల కుటుంబాలకు పెద్దన్నగా మారారు. అభివృద్ధి ద్వారా ఓట్లేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి శ్రమిస్తున్నారు. గత వైసీపీ పాలకుల కక్ష సాధింపు చర్యల కారణంగా అర్ధాంతరంగా ఆగిపోయిన భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలకు ప్రాణ ప్రతిష్ట చేయడంతో పాటు వేలాదిగా నిర్మించిన టిడ్కో ఇళ్లకు జీవం నింపే పనిలో నిమగ్నమయ్యారు. సిటీ నియోజకవర్గంలోని పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తూనే తన వంతుగా కోట్లాది రూపాయల సొంత నిధులతో తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. చదువుతోనే కుటుంబ జీవన విధానం మారుతుందని గట్టిగా విశ్వసించే నారాయణ నగరంలోని నిరుపేద విద్యార్థుల కోసం సరికొత్త విద్యాలయం నెలకొల్పడానికి శ్రీకారం చుట్టారు. రెండు వేల మంది నిరుపేద విద్యార్థులకు కార్పోరేట్ స్థాయిని మించిన విద్య బోధనతో పాటు ఉచిత భోజనం, ఉచిత రవాణా సదుపాయాలతో సరికొత్త విద్యాలయాన్ని ఈ విద్యాసంవత్సరం నుంచి ఆరంభించనున్నారు. నిరుద్యోగ సమస్య నిర్మూళనకు ఇప్పటికే స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి వందలాది మందికి ఉచిత శిక్షణ ఇస్తున్నారు.

అటు భూగర్భ డ్రైనేజి... ఇటు తాగునీటి పథకం

2014-19 మధ్య తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో రూ.100 కోట్లతో చేపట్టిన భూగర్భ డ్రైనేజి, తాగునీటి పథకం పనులు. ఆ రోజుల్లోనే దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా గాలికి వదిలేసింది. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి ప్రారంభించింది. మొత్తం ఐదు ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి క్రేంద్రాలు నిర్మిస్తున్నారు. తాగునీటి పథకం సైతం దాదాపు పూర్తయింది. ఇటీవల ఢిల్లీ వెళ్లిన మంత్రి పొంగూరు నారాయణ. హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో) సీఎండీ సంజాయ్ కుల్ శ్రేష్ఠతో సమావేశమయ్యారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ.11 వేల కోట్లు రుణం మంజూరు చేయించడంతో పాటు, నెల్లూరు నగరంలోని పనులకు రూ.160 కోట్ల నిధులు సాధించారు. తద్వారా పనుల్లో వేగం పెంచారు.

రూ.5లకే ఆకలి తీరుస్తూ..

వైసీపీ హయాంలో మూసివేసిన అన్న క్యాంటీన్లను కూటమి ప్రభుత్వం రాగానే పునఃప్రారంభించారు. ఏడు ప్రాంతాల్లో దాదాపు రూ.70 లక్షలు ఖర్చు పెట్టి వాటిని ఆధునీకరించారు. పాత మున్సిపల్ కార్యాలయం, పెద్దబజారు, చేపల మార్కెట్, ఏసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్, రామలింగాపురం, పప్పులవీధి తదితర ప్రాంతాల్లో క్యాంటీన్లు ప్రారంభించారు. రూ.5లకే రుచికరమైన ఆహారం అందిస్తున్నారు.



రీచ్‌లో నూతన ఇసుక విధానాన్ని పరిశీలించే క్రమంలో

చెత్త పన్నుకు చెల్లు చీటీ

నగర, పట్టణాల్లో గత ప్రభుత్వం విధించిన చెత్త పన్ను రద్దు బిల్లును మంత్రి నారాయణ శాసనసభలో ప్రతిపాదించగా సభ ఆమోదం తెలిపింది. ఇది ప్రజలకు ఎంతో ఊరటనిచ్చింది. 2021లో వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన ఈ విధానంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. నగరంలో మొత్తం 1.33 లక్షలు అసెస్‌మెంట్లు ఉండగా... రూ.118 కోట్ల మేర వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలపై ఆ భారం తపిపంది. అదే సమయంలో చెత్త సమస్యకు పరిష్కారంగా వేస్ట్‌టూ ఎనర్జీ ప్లాంట్ మంజూరు చేయించారు. ఇది అందుబాటులోకి వస్తే దొంతాలి, అల్లీపురం రోడ్డు నవాబుపేట సమీపంలో డంపింగ్ యార్డులు ఉండవు.

వారంలో రెండు రోజుల నెల్లూరులోనే!

మంత్రి నారాయణ రాజధాని నిర్మాణ పనుల్లో క్షణం తీరిక లేకుండా ఉన్నప్పటికీ... వారంలో రెండు రోజులు నెల్లూరు నగరవాసులకు అందుబాటులో ఉంటున్నారు. ఐదు రోజులపాటు విజయవాడలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు ఇన్‌ఛార్జి మంత్రిగా కాకినాడలో జరిగే కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. నెల్లూరు నగరంలో ఉన్న రెండు రోజుల క్షణం తీరిక లేకుండా శ్రమిస్తున్నారు. అధికారుల సమీక్షలతోపాటు క్షేత్రస్థాయిలో పరిస్థితులు దగ్గరుండి పరిశీలిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉచిత ఇసుక విధానం, దీపం పథకం, పింఛన్ల పెంపు కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇసుక విధానంలో లోటుపాట్లను సరిదిద్దేందుకు నేరుగా రీచ్‌లకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ఇరిగేషన్ కాలువల్లో జరిగే పనులను డ్రోన్ కెమెరాతో చిత్రీకరించేలా చర్యలు చేపట్టారు. ఐఏబీ సమావేశంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని రైతులు తీసుకొచ్చిన సమస్యను, వెనువెంటనే విద్యుత్తుశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

టిడ్కో ఇళ్లకు జీవం

వెంకటేశ్వరపురం, అల్లీపురం, కొండ్లపూడి, అక్కచెరువుపాడు తదితర ప్రాంతాల్లో నిరుపేదలకు నీడ కల్పించేందుకు గతంలో టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లు సిద్ధం చేస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పక్షపాత ధోరణితో నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లలో కనీస సౌకర్యాలు కల్పించకుండా రంగులేసి చేతులు దులుపుకొంది. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం లబ్ధిదారులకు వాటిని అందించేందుకు సిద్ధం చేస్తోంది. వెంకటేశ్వరపురంలో 4,800, అల్లీపురం 11,424, అక్కచెరువుపాడు 3696, కల్లూరుపల్లి 2496, కొండ్లపూడి 2496, ఇరుగాళమ్మ సంఘం 48 ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేస్తోంది. వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానుంది.

మార్కెట్ అభివృద్ధికి ప్రతిపాదనలు

నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలం నవాబుపేట వద్ద నిరుపయోగంగా ఉండగా ఫల సరుకులతో పాటు పండ్ల హోల్‌సేల్ మార్కెట్‌గా అభివృద్ధి చేయడంపై నారాయణ దృష్టి సారించారు. ప్రతిపాదనలు సైతం సిద్ధం చేయించారు. అందు కోసం రూ.50 కోట్ల నుంచి రూ. వంద కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. అధికారులతో నివేదికను సిద్ధం చేయించి, ప్రభుత్వానికి పంపించారు.

స్మార్ట్ సిటీగా మార్చేందుకు...

నగరాన్ని సుందరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే రోడ్లపై, గోడలు, డివైడర్లపై రంగులు వేస్తుండగా నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి తెచ్చేందుకు రూ.5 కోట్లతో 40 పార్కులు అభివృది చేస్తున్నారు. పోస్టర్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకూ అడుగులు వేస్తున్నారు. గుంతలు లేని నగరాన్ని తీర్చిదిద్దడంలో భాగంగా సుమారు 1400 గుంతలను గుర్తించి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. అదే సమయంలో ఏడు వేల అనధికారిక కొళాయిలపై చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ఐదేళ్లలో నెల్లూరును స్మార్ట్ సిటీగా మారుస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

అభివృద్ధే అజెండాగా!

రాష్ట్రంలో అన్ని నగరాలు, పట్టణాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. వీటితో పాటు మరికొన్నింటికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం పరిధిలో రూ.1587.80 కోట్లు, కొవ్వూరు డివిజన్ పరిధిలో రూ.280.90 కోట్లతో పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటిని 2027 గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేసేలా కార్యచరణ రూపొందించారు. విజయవాడను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా నగరంలో ఒకేసారి 14 టన్నుల చెత్తను తీసుకువెళ్లే అత్యాధునిక వాహనాలను ప్రారంభించారు. కానూరులో సిద్ధార్థ ఫ్లైఓవర్ ప్రారంభించారు. నిరంతర విద్యుత్తు సరఫరా ఉండాలనే లక్ష్యంతో తాళ్లాయిపాళెంలో జీఐఎస్ విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను సీఎం చంద్రబాబుతో కలిసి నారాయణ ప్రారంభించారు.

పట్టణ ప్రణాళికలో సంస్కరణ

భవనాలు, లేఅవుట్లు అనుమతులు సులభతరం చేస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోగా... టౌన్ ప్లానింగ్ విభాగంలో అక్రమాలకు చెక్ పెట్టేలా మంత్రి నారాయణ అనేక నిర్ణయాలు తీసుకున్నారు. నుడాలో అక్రమాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. డిసెంబరు 31 నుంచి సింగిల్ విండో విధానం ద్వారా భవన నిర్మాణ అనుమతులు ప్రారంభించారు.



అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తూ... అల్పాహారం రుచి చూస్తూ...



ఉపాధి కల్పనలో భాగంగా తోపుడు బండ్లు అందజేస్తూ...

ఆహ్లాదం... ఆనందం... అందించేందుకు!

వారాంతంలో నెల్లూరు నగరవాసులు ఆహ్లాదంగా గడిపేందుకు సరైన వసతులు లేవు. దాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో నెల్లూరు చెరువు దగ్గర నెక్లెస్ రోడ్డు నిర్మాణాన్ని రూ. 22 కోట్లతో చేపట్టారు. చెరువు వద్ద మౌలిక వసతులతో పాటు నడక మార్గం, సైక్లింగ్ ట్రాక్, లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. సమీపంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద కూడా ఘాట్ నిర్మాణం చేపట్టారు. దాంతో నగరానికి ఒక హంగు ఏర్పడింది. సాయంత్రం వేళ ప్రజలు అక్కడ కుటుంబ సభ్యులతో సేద తీరడానికి తగిన అభివృద్ధి పనులు చేస్తున్నారు. రంగనాయకుల ఘాట్, శివాలయం దగ్గర కోనేరు, బాప్టిజం ఘాట్ అభివృద్ధికి రూ.16 కోట్లు వెచ్చించారు. ప్రస్తుతం మళ్లీ సుందరీకరణపై దృష్టి పెట్టారు. తిక్కన పార్క్, పినాకిని పార్క్, పెన్నా బ్యారేజీల తీరును పరిశీలించారు. రంగనాయకులపేట నుంచి పొట్టేపాళెం వరకు సుందరీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వీధి వ్యాపారుల కోసం స్మార్ట్ బజార్లు

వీధి వ్యాపారులకు జీవనోపాధి వసతుల కల్పనకు నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్ బజార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మూవబుల్ కంటెయినర్లలో దుకాణాలు నిర్మిస్తున్నారు. ఇందుకోసం ఒక్కో కంటైనర్‌కు రూ.6 లక్షలు ఖర్చు చేస్తున్నారు. మైపాడు రోడ్డు జాఫర్ సాహెబ్ కాలువ ప్రాంతంలో ప్రయోగాత్మకంగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. మొదటి విడతలో 160 దుకాణాలు ఏర్పాటు చేసి, చిరు వ్యాపారులకు అందించనున్నారు. ఒక కంటైనర్‌లో 4 దుకాణాలు నిర్మించడంతోపాటు సౌర విద్యుత్తు కనెక్షన్, ప్రాంగణంలో ఆహ్లాదకర పచ్చదనం, పార్కింగ్ సౌకర్యం, కంటైనర్లపై కూర్చుని ఆహార పదార్థాలు తినే హోటల్ లాంటి సౌకర్యం కల్పిస్తున్నారు. ఉచిత వైఫై సౌకర్యం, సెల్ఫీపాయింట్, తాగునీరు, మరుగుదొడ్లు, రంగు రంగుల విద్యుద్దీపాలతో అందుబాటులోకి తీసుకురానున్నారు. వ్యాపారులపై ఎలాంటి అర్థిక భారం లేకుండా మెప్మా ఆధ్వర్యంలో రూ.2 లక్షల చొప్పున రుణం అందించనున్నారు. ఇప్పటికే 500 మంది దరఖాస్తు చేసుకున్నారు.

వరద ప్రభావిత ప్రాంతంలో..

భారీ వర్షాలకు బుడమేరు ఉప్పొంగడంతో విజయవాడ నగరం మునిగిపోయింది. 24 గంటల వ్యవధిలో కుండపోత వర్షాలతో ఆ ప్రాంతం అతలాకుతలమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో మంత్రి నారాయణ రేయింబవళ్లు అక్కడే ఉండి సేవలు అందించారు. నిరంతరం సహాయ, పునరావాస కార్యాక్రమాల్లో పాల్గొన్నారు. సింగ్‌నగర్, పైపుల రోడ్డు, ప్రకాశ్‌నగర్, సుందరయ్యనగర్‌లో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమాతో కలిసి పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలకు ధైర్యం చెప్పారు. వరద తగ్గు ముఖం పట్టగానే ఇళ్లలో పేరుకుపోయిన బురద తొలగించేందుకు ఫైర్ ఇంజన్లను వినియోగించేలా చర్యలు తీసుకున్నారు.

శతకం ఆవిష్కరణ : కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కవి, రచయిత గణపతిరాజు వెంకట శేషగిరిరావు రచించిన 'నా మంచిమాట' శతకం ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం రాత్రి జరిగింది.

టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదు

అనతసాగరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి పిలుపు మేరకు టీడీపీ శాశ్వత సభ్యత్వాలకు నేతలు పోటీపడుతున్నారు. సోమవారం మండలంలోని సాగరం చెరువు సొసైటీ అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి, మెట్టు కూరు సుబ్బారెడ్డి, చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, శాఖమూరి వెంకటేశ్వర్లు, కమ్మ ప్రభాకర్‌నాయుడు, రాపూరు సుజాత, ఖాసీంబాషా, మహేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారు. నాయకులను మంత్రి ఆనం అభినందించారు.



కందుకూరు: పలుకూరులో బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



జలదంకిలో ముగ్గుల పోటీ విజేతకు నగదు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



కావలి : రెడ్డి సంక్షేమ సంఘం క్యాలెండరను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, ,సంఘం నేతలు

సుహృద్భావం, ఐక్యతకు క్రీడలు దోహదం : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సుహృద్భావం, ఐక్యత పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహద పడతాయని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని పలుకూరు గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలుకూరు గ్రామాభివృద్ధికి తనవంతు తోడ్పాటునందిస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో రాష్ట్రాన్ని క్రీడాకారుల హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నార్నె రోశయ్య, దామా మల్లేశ్వరరావు, వెంకట నరసింహం, యడపల్లి చంద్రయ్య, ఎంతఓ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు ఎమ్మెల్యే కాకర్ల బహుమతులు

జలదంకి (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ గ్రామాల్లో కొత్తశోభను తెచ్చిపెట్టింది. సుదూరప్రాంతాలలో ఉంటున్న కుటుంబసభ్యులు పండుగకు స్వగ్రామానికి చేరుకుని భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం తెల్లవారు జామునే ప్రతి ఇంటా భోగిమంటలు వేసుకున్నారు. చిన్నారులకు భోగిపొళ్ళు పోశారు. పండుగను పురస్కరించుకుని జలదంకి, బ్రాహ్మణక్రాకలలో ఆటల పోటీలు నిర్వహించారు. జలదంకి హైస్కూల్‌లో కబడ్డీ పోటీలను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. ముగ్గుల పోటీలలో విజేతలకు ఎమ్మెల్యే చేతులమీదుగా నిర్వాహకులు నగదు బహుమతి అందించారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆటలపోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

● భోగి సంబరాలలో నేతల సందడి

● వింజమూర (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు ఆనందంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోరారు. స్థానిక టీడీపీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో సోమవారం ఆయన భోగి మంటలు వేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

క్యాలెండరు ఆవిష్కరించిన ఎమ్మెల్యే దగుమాటి

కావలి (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి నివాసంలో సోమవారం కావలి రెడ్డి సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అలాగే తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు జేదిత్య ప్రింట్ చేయించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారు విశేషంగా జరుపుకునే పండుగ సంక్రాంతిని ప్రతి ఒక్కరి జీవితాలలో ఆనందాలు వెల్లివిరియాలన్నారు. నియోజకవర్గ ప్రజలు పాడిపంటలతో సుభిక్షితంగా ఉండాలని కోరుకున్నారు. ఎమ్మెల్యేకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలపటానికి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే కార్యాలయం కిటకిటలాడింది.

ఇస్కపల్లిలో సంక్రాంతి సంబరాలు

అల్లూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకొని మండలంలోని ఇస్కపల్లిలో సంబరాలు మిన్నంటాయి. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పదవీ బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటిసారి ఇస్కపల్లిలో సోమవారం పర్యటించారు. బీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో తన కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. ఆయన ఇంటి వద్దకు అబిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి ఆయనకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలుగు సంప్రదాయాలకు ప్రతీక అయిన గంగిరెద్దు, హరిదాసులతో ముంగిట్లో సంక్రాంతి శోభను సంతరించుకుంది. కోలాటాలు, మంగలవాయిద్యాలతో స్థానిక కాశీవిశ్వేశ్వరాలయానికి, అనంతరం గంగమ్మ ఆలయానికి తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు వేసిన ముగ్గులను తిలకించారు. గత నాలుగు రోజులుగా ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని యువతకు నిర్వహించిన ఆటల పోటీలు, మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నార్ డెల్టా ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం వేకువజామున పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య తదితరుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని భోగి మంటలు వేసి వేడుకలు నిర్వహించారు.